అక్షర కలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 93962 18955

epaper. aksharakalam. com

# అక్షర కలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 169 | 13-09-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00




'అతిథి దేవో భవ'.. బ్రిక్స్

## అతిథులకు రాజసం ఉట్టిపడేలా భారతీయ ఆతిథ్యం

దేశ రాజధాని ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా హాజరవుతున్న అతిథుల కోసం జైపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారతదేశంలో రాజులు, మహారాజుల విందుల్లో ఉపయోగించిన పాత్రలను గుర్తుచేసేలా రాజసం ఉట్టిపడే సంప్రదాయ డిజైన్లతో వీటిని తయారు చేశారు. భారతీయ, చైనీస్, రష్యన్ తదితర దేశాల వంటకాలను వడ్డించేందుకు అనువుగా దాదాపు 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను ప్రత్యేకంగా డిజైన్ చేశారు.

2



బ్రిక్స్‌లో కీలక పరిణామం..

## సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం..

భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిక్స్ సభ్య దేశాలు సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ప్రకటనను శనివారం నేతలు అధికారికంగా ఆమోదించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ విభేదాలను అధిగమించి సంయుక్త ప్రకటనకు అంగీకారం కుదరడం భారత్‌కు కూడా కీలక దౌత్య విజయంగా భావిస్తున్నారు.

2



మోదీతో ఫొటో కోసం

## ప్రతినిధుల సందడి.. పుతిన్, పెజెష్కియన్ ఏం చేశారంటే..

భారత్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఓ సరదా సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఫొటో దిగేందుకు పలువురు ప్రతినిధులు ఆయన చుట్టూ చేరారు. అదే సమయంలో అక్కడ ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ వారికి చోటిచ్చేందుకు పక్కకు తప్పుకున్నారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. న్యూఢిల్లీలో శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో ఈ ఘటన జరిగింది. కార్యక్రమం సందర్భంగా మోదీ వద్దకు వచ్చిన కొందరు ప్రతినిధులు ఆయనతో ఫొటో దిగేందుకు ఆసక్తి చూపించారు.

# పేదల భూములు కొట్టేసేందుకే
# కేసీఆర్ ధరణి తెచ్చారు

- నలుగురు వ్యక్తులు, నాలుగు గోడల మధ్య ధరణి
- పింక్ కలర్ చొక్కాలు వేసుకున్న వారికే ప్రయోజనం
- అక్రమాల కారణంగా ఎందరో రైతులు ఆత్మహత్యలు
- 22ఏ పేరుతో పేదల భూములను చెరబట్టారు
- ప్రజల ఆస్తులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- లాక్ సిస్టమ్‌తో అక్రమాలు దాచారు
- వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థల రద్దుతో గ్రామాల్లో ఇబ్బందులు
- రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్:

**పేదల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్ పెద్ద స్కెచ్ వేశారని రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆ స్కెచ్‌లో భాగంగానే ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి భూములను కొట్టేశారని అన్నారు. నలుగురు వ్యక్తులు, నాలుగు గోడల మధ్య ధరణిని తీసుకొచ్చారని విమర్శించారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి వల్ల పింక్ కలర్ చొక్కాలు వేసుకున్న వారికే ప్రయోజనం కలిగిందని మంత్రి ఆరోపించారు. ధరణిలో జరిగిన అక్రమాల కారణంగా ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ శాఖలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విధ్వంసం చిన్నది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.**

22ఏ పేరుతో పదేళ్ల పాటు పేదల భూములను చెరబట్టారని మంత్రి విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆస్తులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పదేళ్లలో దొర, వారి బంధువుల ఆస్తులు పెంచుకునేందుకే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. రెవెన్యూ శాఖ పూర్తిగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసైగల్లోనే నడిచిందని వ్యాఖ్యానించారు. తెలంగాణవార్తలు

లాక్ సిస్టమ్‌తో అక్రమాలు దాచారు

ధరణిలో జరిగిన అక్రమాస్తులు బయటకు కనిపించకుండా లాక్ సిస్టమ్ తీసుకొచ్చారని పొంగులేటి ఆరోపించారు. భూముల ట్రాన్సాక్షన్లు బయటకు కనిపించకుండా ఈ విధానం పెట్టారని విమర్శించారు. ధరణి చట్టం తీసుకొచ్చిన సమయంలో మూడు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని తెలిపారు. తమ ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిన తర్వాత ఒక్కరోజు కూడా రిజిస్ట్రేషన్లు నిలిపివేయలేదని మంత్రి స్పష్టం చేశారు.

వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థల రద్దుతో గ్రామాల్లో ఇబ్బందులు

వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థలను రద్దు చేసి గ్రామాల్లో పాలనను అస్తవ్యస్తం చేశారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ధరణిలో సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించే పరిస్థితి కూడా లేకుండా చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పేదల ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు. లంగాణలో పేదల భూములు, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ విధానమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖకు మంత్రి ఉన్నప్పటికీ గతంలో అన్ని వ్యవహారాలను కేసీఆరే చూసేవారని ఆరోపించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ హయాంలోని భూ

## అక్రమాలను అసెంబ్లీ ముందు ఉంచుతాం

:కేసీఆర్ హయాంలో తెలంగాణలో పేదలకు అందాల్సిన ఆస్తులపై కన్నేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములను కొల్లగొట్టేందుకు మాస్టర్ స్కెచ్ వేశారని పేర్కొన్నారు. 22ఏ సంబంధిత భూముల సమస్యలపై అసెంబ్లీలో లఘు చర్చను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఆ మాస్టర్ స్కెచ్‌లో భాగమే ధరణిని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ధరణిని తీసుకొచ్చారని అన్నారు.



2



2

హైదరాబాద్

## డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయండి: సీఎంకు రాజాసింగ్ విజ్ఞప్తి

కొండా సురేఖకు అధిష్ఠానం

## నుంచి పిలుపు



మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఢిల్లీకి వెంటనే రావాలని ఆమెకు అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం అందింది. మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖతో నిన్న (శుక్రవారం) తెలంగాణ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ స్వయంగా మాట్లాడారు. కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తుంది.

2



2

తెలంగాణ ఆర్థిక ప్రగతికి హైదరాబాద్ అత్యంత కీలక

## ప్రాంతం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ మహానగరానికి డీసెంట్రలైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వేగంగా ఎదుగుతున్న హైదరాబాద్‌ను రాబోయే 20 నుంచి 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర పాలనను మార్చాల్సి ఉందన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతంగా, సమన్వయంతో పరిపాలన అందించాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నగర పాలనను తీర్చిదిద్దాలని చెప్పారు. క్యూర్ యాక్ట్- 2026 ప్రధాన ఉద్దేశం ఇదేనని ఆయన స్పష్టం చేశారు. 400 ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్.. ఎన్నో రాజ వంశాలు, సంస్కృతులను కలుపుకుని ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని గుర్తు చేశారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు.. హైదరాబాద్ ప్రయాణం గొప్ప పరిణామానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

# 'అతిథి దేవో భవ'.. బ్రిక్స్ అతిథులకు రాజసం ఉట్టిపడేలా భారతీయ ఆతిథ్యం

ఇంటర్నెట్ డెస్క్:

దేశ రాజధాని ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా హాజరవుతున్న అతిథుల కోసం జైపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారతదేశంలో రాజులు, మహారాజుల విందుల్లో ఉపయోగించిన పాత్రలను గుర్తుచేసేలా రాజసం ఉట్టిపడే సంప్రదాయ డిజైన్లతో వీటిని తయారు చేశారు. భారతీయ, చైనీస్, రష్యన్ తదితర దేశాల వంటకాలను వడ్డించేందుకు అనువుగా దాదాపు 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ప్రతి పాత్రను ఎంతో నైపుణ్యంతో రూపొందించి, అందమైన కళాకృతులతో అలంకరించారు. ప్రతి వస్తువుకు మెరుగైన మెరుపు, నాణ్యత వచ్చేలా 10 దశల్లో కోటింగ్, ఫినిషింగ్ ప్రక్రియను నిర్వహించారు. భారతదేశానికి వచ్చే విశిష్ట అతిథులను దైవ సమానులుగా భావించే 'అతిథి దేవో భవ' సంప్రదాయాన్ని ఈ ప్రత్యేక వెండి పాత్రలు ప్రపంచ దేశాల నేతలకు చాటిచెబుతున్నాయి. భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వీటిని ప్రత్యేక డిజైన్లతో తయారు చేశారు.అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈవో అరుణ్ పబువాల్ మాట్లాడుతూ.. ప్రముఖుల కార్యక్రమాలకు తమ టేబుల్‌వేర్‌ను అందించడం ఇదే తొలిసారి కాదన్నారు. 2023లో జరిగిన జీ20 సదస్సుతో పాటు పలు వీఐపీ కార్యక్రమాలు, దేశానికి వచ్చిన అధ్యక్షుల పర్యటనల్లోనూ తమ ఉత్పత్తులను ఉపయోగించినట్లు తెలిపారు. తమ కట్లరీలో ఆధునిక, సంప్రదాయ డిజైన్లు ఉన్నాయని చెప్పారు.కంపెనీ ఎండీ అంతర పబువాల్ మాట్లాడుతూ.. ఉత్పత్తుల నాణ్యతే తమ ప్రధాన ప్రత్యేకత అని తెలిపారు. పాత్రల తయారీలో నాణ్యత విషయంలో రాజీ పడబోమని చెప్పారు. పూత, డిజైన్, ఫినిషింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, ఉత్పత్తుల తయారీ నుంచి డిస్పాచ్ వరకు మొత్తం 10 దశల్లో ఫినిషింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు.

# బ్రిక్స్‌లో కీలక పరిణామం.. సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం..

ఇంటర్నెట్ డెస్క్:

భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిక్స్ సభ్య దేశాలు సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ప్రకటనను శనివారం నేతలు అధికారికంగా ఆమోదించే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ విభేదాలను అధిగమించి సంయుక్త ప్రకటనకు అంగీకారం కుదరడం భారత్‌కు కూడా కీలక దౌత్య విజయంగా భావిస్తున్నారు. సంయుక్త ప్రకటనలో ఏ ఒక్క దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించే అవకాశం లేదు. అయితే ఏ దేశమైనా ఏకపక్షంగా యుద్ధానికి దిగడాన్ని ఖండించే అంశాన్ని ప్రకటనలో చేర్చినట్లు సమాచారం. ఇరాన్, యూఏఈ రెండు బ్రిక్స్ సభ్య దేశాలే అయినప్పటికీ.. ప్రస్తుత గల్ఫ్ సంక్షోభంలో ఇరు దేశాల వైఖరులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి . ఈ పరిస్థితుల్లో ఇరు దేశాలూ అంగీకరించే భాషను సంయుక్త ప్రకటనలో పొందుపరచడం బ్రిక్స్ దౌత్యవేత్తలకు పెద్ద సవాలుగా మారింది. బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్‌కు ఈ సదస్సు అత్యంత కీలకం. ఇరాన్‌తోనూ, యూఏఈతోనూ భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టి బ్రిక్స్‌లో ఏకాభిప్రాయం సాధించేలా భారత్ చర్చలను ముందుకు నడిపించింది.

# మోదీతో ఫొటో కోసం ప్రతినిధుల సందడి.. పుతిన్, పెజెష్కియన్ ఏం చేశారంటే..

ఇంటర్నెట్ డెస్క్:

భారత్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఓ సరదా సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఫొటో దిగేందుకు పలువురు ప్రతినిధులు ఆయన చుట్టూ చేరారు. అదే సమయంలో అక్కడ ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ వారికి చోటిచ్చేందుకు పక్కకు తప్పుకున్నారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. న్యూఢిల్లీలో శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో ఈ ఘటన జరిగింది. కార్యక్రమం సందర్భంగా మోదీ వద్దకు వచ్చిన కొందరు ప్రతినిధులు ఆయనతో ఫొటో దిగేందుకు ఆసక్తి చూపించారు. ఓ ప్రతినిధి 'మీతో ఒక ఫొటో దిగొచ్చా' అని అడగ్గా.. మోదీ వెంటనే అంగీకరించారు. దీంతో మరికొందరు ప్రతినిధులు కూడా ఆయన చుట్టూ చేరారు. అందరూ కెమెరాకు పోజిచ్చేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అక్కడ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా ఉన్నారు.ప్రతినిధులు మోదీ చుట్టూ చేరుతుండటంతో వారికి అవకాశం కల్పిస్తూ పుతిన్, మసూద్ పెజెష్కియన్ పక్కకు వెళ్లారు. ఫొటోకు పోజిస్తున్న సమయంలో మోదీ చేసిన సరదా వ్యాఖ్య అక్కడ నవ్వులు పూయించింది. మహిళా ప్రతినిధులను ఉద్దేశించి 'యూ ఆర్ లక్కీ, సో మెనీ లేడీస్' అని మోదీ అన్నారు. దీనికి వారు కూడా వెంటనే స్పందిస్తూ 'వుయ్ ఆర్ ఆల్ సో లక్కీ' అన్నారు. దీంతో మోదీతో పాటు అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. ఫొటో సెషన్ ముగిసిన తర్వాత మోదీ వారికి ధన్యవాదాలు తెలిపారు.

# కొండా సురేఖకు అధిష్ఠానం నుంచి పిలుపు

వరంగల్,

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. ఢిల్లీకి వెంటనే రావాలని ఆమెకు అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం అందింది. మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖతో నిన్న (శుక్రవారం) తెలంగాణ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ స్వయంగా మాట్లాడారు. కొండా సురేఖకు కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తుంది. వరంగల్ జిల్లాలోని గీసుకొండలో కొండా సురేఖ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు పరకాల అసెంబ్లీ స్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖను వివరణ కోరింది. ఈ సందర్భంగా కమిటీకి ఆమె రెండు లేఖలు రాశారు.ఈ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ.. పీసీసీ చీఫ్‌కు నివేదిక అందించింది. ఈ నివేదికను పార్టీ అధిష్ఠానానికి తెలంగాణ పీసీసీ చీఫ్ అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేశారు. అయితే తాను ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు.

మరో వైపు ఫేస్‌బుక్ వేదికగా 'బిగ్ అప్డేట్ కమింగ్ సూన్' అంటూ ఆమె పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే దీంతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అలాంటి వేళ.. కొండా సురేఖను పార్టీ అధిష్ఠానం ఢిల్లీ రావాలంటూ సందేశం పంపడం వెనుక బలమైన కారణం ఉండి ఉంటుందనే ఓ ప్రచారం సాగుతోంది.

# బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు

**అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్య వేదిక**

**భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడంలో 'మానవాభివృద్ధే కీలకం'**

**ఒక ప్రత్యేక 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం'**

**'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ ఆమోదం**

**యుద్ధం పరిష్కారం కాదు - చర్చలే మార్గం**

**భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం**

న్యూఢిల్లీ: అక్షరకలం ప్రతినిధి

ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ రకమైన పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్య వేదిక అని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడంలో 'మానవాభివృద్ధే కీలకం' అనే నమూనాను అనుసరిస్తోందన్నారు. మారుతున్న గ్లోబల్ పరిణామాలకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఇతర ప్రపంచ సంస్థలలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) స్వరాన్ని మరింత బలపరచాలని కోరారు. బ్రిక్స్ ప్రారంభమై రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న




సందర్భంలో, కూటమి సాధించిన ఏకాభిప్రాయాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు సాధించే దిశగా తీసుకెళ్లాలని మోదీ సూచించారు. అన్ని నిర్ణయాలు, కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగేందుకు బ్రిక్స్ లోపల ఒక ప్రత్యేక 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

## 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ ఆమోదం

సదస్సులో చారిత్రక ఘట్టం నమోదైంది. సదస్సులో భాగంగా రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కు కూటమిలోని సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతున్న పశ్చిమాసియా సంక్షోభంపైనా సభ్య దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం వ్యక్తమైంది.

## యుద్ధం పరిష్కారం కాదు - చర్చలే మార్గం

పశ్చిమాసియా పరిణామాలపై బ్రిక్స్ కూటమి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏ రకమైన సమస్యకూ యుద్ధం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. శాంతిని నెలకొల్పడానికి నిరంతర చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని సభ్య దేశాలు తేల్చిచెప్పాయి.

# కేసీఆర్ హయాంలోని భూ అక్రమాలను అసెంబ్లీ ముందు ఉంచుతాం: పొంగులేటి

హైదరాబాద్,

:కేసీఆర్ హయాంలో తెలంగాణలో పేదలకు అందాల్సిన ఆస్తులపై కన్నేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములను కొల్లగొట్టేందుకు మాస్టర్ స్కెచ్ వేశారని పేర్కొన్నారు. 22ఏ సంబంధిత భూముల సమస్యలపై అసెంబ్లీలో లఘు చర్చను మంత్రి పొంగులేటి ప్రారంభించారు.ఆ మాస్టర్ స్కెచ్‌లో భాగమే ధరణిని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ధరణిని తీసుకొచ్చారని అన్నారు. నలుగురు వ్యక్తులు నాలుగు గోడల మధ్య అర్ధరాత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ధరణి వచ్చాక పేదలు అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

## తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టారు..

ధరణి నిర్వహణ కాంట్రాక్ట్‌ను కూడా తమకు అనుకూలమైన సంస్థకే ఇచ్చారని మంత్రి పొంగులేటి చెప్పారు. తెలంగాణ భూములను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆరోపించారు. తాకట్టు పెట్టిన భూములను మరో సంస్థకు బదిలీ చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భూములను సొంత ఆస్తుల్లా ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్లు చేశారని అన్నారు. కేసీఆర్ హయాంలోని అక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా తాము సభ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్న నాయకులు.. మాజీ మంత్రులు.. ఎమ్మెల్యేలు కూడా ధరణిపై మాట్లాడారని చెప్పారు. ప్రభుత్వం మంచి చేస్తే మంచి చేయాలని.. కానీ విషం చిమ్మే సంస్కృతి సరికాదని పేర్కొన్నారు.

## పేదల భూములను దోచుకునేందుకే ధరణిని తీసుకొచ్చారు..

'పేదల భూములను దోచుకునేందుకే ధరణిని తీసుకొచ్చారు. తప్పు చేసినోడు తల వంచుకుంటారని.. పాపం చేసినోడు పారిపోతారు. ఈరోజు శాసనసభ సాక్షిగా అదే అక్షరాలా నిజమైంది. ఈ భూములపై చర్చకు ముఖం చాటేయడం బీఆర్ఎస్ నేతలకు కొత్తేమీ కాదు. సభలో గందరగోళం సృష్టించి ఉద్దేశపూర్వకంగానే పారిపోయారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ శాఖలో భారీ స్కాం చేశారు. అడ్డగోలుగా నొక్కేసిన భూముల లెక్కలు చిన్నవి కాదు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోవచ్చు.. కానీ నాలుగు కోట్ల ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది. తెలంగాణ కోసం అనేక మంది యువత ఆత్మబలిదానాలు చేశారు. యూపీఏ ప్రభుత్వం.. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. పేదలకు పూర్తి హక్కులు వస్తాయని ప్రజలు కలలు కన్నారని.. కానీ తెలంగాణను వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు. వారి ఆస్తులు.. బంధువుల ఆస్తులు పెంచుకునేందుకే తెలంగాణను వాడుకున్నారు.భూముల విషయంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది. రెవెన్యూ శాఖ మొత్తం అప్పటి ముఖ్యమంత్రి కన్నుసైగల్లోనే నడిచింది. రెండోసారి కూడా రెవెన్యూ శాఖను కేసీఆర్ తన వద్దే ఉంచుకున్నారు' అని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు.

## భూ రికార్డులు, హక్కుల విషయంలో పారదర్శకత అవసరం..

'భారతీయ సంస్కృతిలో మట్టికి--మనిషికి విడదీయరాని బంధం ఉంది. భూమి కేవలం ఆస్తి కాదని.. రైతు చెమటకు ప్రతీక. కుటుంబ భవిష్యత్తుకు భూమే భరోసా.. ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం. కష్టపడి కొనుగోలు చేసిన చిన్న స్థలమైనా.. పంట పొలమైనా ఎంతో విలువైనదే. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములతో కుటుంబాల అనుబంధం ఉంది. భూమికి సంబంధించిన ప్రతి నిర్ణయం అత్యంత బాధ్యతతో ఉండాలి. భూ రికార్డులు, హక్కుల విషయంలో పారదర్శకత అవసరం. సాంకేతికతతో భూ రికార్డుల ఆధునీకరణ జరగాలి. చిన్న రైతులు, సామాన్యుల భూ హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలి. భూమి విషయంలో జరిగే చిన్న తప్పు.. కుటుంబ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కీలకం. మట్టి మీద హక్కు అంటే.. కుటుంబ భవిష్యత్తుపై హక్కు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# హైదరాబాద్ డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయండి: సీఎంకు రాజాసింగ్ విజ్ఞప్తి

హైదరాబాద్,

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సిటీ డెవలప్‌మెంట్‌పై సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై గత ముఖ్యమంత్రిని కోరిన ఆయన సమావేశం పెట్టలేదని పెదవి విరిచారు.సిటీ డెవలప్‌మెంట్‌లో ఎమ్మెల్యేలకు బాధ్యత ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.. ఎమ్మెల్యేలకే నియోజక వర్గ సమస్యలు తెలుస్తాయని అన్నారు. గ్లోబల్ సిటీ కావాలంటే ప్రతి డివిజన్ సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. సిటీలో రహదారులు చాలా వరకు డ్యామేజ్ ఉన్నాయని.. డ్రైనేజ్ సరిగా లేదు వాటి మీద కూడా దృష్టి పెట్టాల్సి ఉందని తెలిపారు. బస్తీల్లో సరఫరా అయ్యే మంచి నీటిలో డ్రైనేజ్ వాటర్ కలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ మూడు కార్పొరేషన్లు చేస్తున్నారని.. కానీ మంచి డెవలప్‌మెంట్ కావల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మూడు కార్పొరేషన్లపై చర్చ జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు ఏళ్ళు పూర్తయిందని.. ఇంకా 15 నెలల సమయం ఉందని గుర్తు చేశారు. ఈ 15 నెలల్లో మూసీ డెవలప్‌మెంట్ అవుతుందా..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ వర్క్ నిదానంగా జరుగుతుందని అన్నారు. నగరంలో దోమల బెడద విపరీతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.20 శాతం ప్రాపర్టీ టాక్స్ పెంచి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు విలువ ఉందో? లేదో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. గతంలో ఓ ఎమ్మెల్యే మీడియా ముందే అధికారులు విలువ ఇవ్వడం లేదని చెప్పారని గుర్తు చేశారు. అధికారులను రిక్వెస్ట్ చేసినా స్పందించడం లేదని ఎమ్మెల్యే రాజా సింగ్ వాపోయారు. పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హైదరాబాద్ గ్లోబల్ సిటీ కావాలని చాలా ఏళ్లుగా ప్రజలు కోరుతున్నారని చెప్పారు. ప్రతి సారి గ్లోబల్ సిటీ అవుతుందని అంటున్నారు కానీ అది పేపర్ల వరకే పరిమితం అవుతుందని అసహనం వ్యక్తం చేశారు. తన కల హైదరాబాద్ మంచి గ్లోబల్ సిటీ కావాలని చెప్పుకొచ్చారు. తమతో భేటీ అయి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి హైదరాబాద్ అత్యంత కీలక ప్రాంతం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,

హైదరాబాద్ మహానగరానికి డీసెంట్రలైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వేగంగా ఎదుగుతున్న హైదరాబాద్‌ను రాబోయే 20 నుంచి 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర పాలనను మార్చాల్సి ఉందన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువగా, సమర్థవంతంగా, సమన్వయంతో పరిపాలన అందించాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా నగర పాలనను తీర్చిదిద్దాలని చెప్పారు. క్యూర్ యాక్ట్-2026 ప్రధాన ఉద్దేశం ఇదేనని ఆయన స్పష్టం చేశారు.400 ఏళ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్.. ఎన్నో రాజ వంశాలు, సంస్కృతులను కలుపుకుని ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని గుర్తు చేశారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు.. హైదరాబాద్ ప్రయాణం గొప్ప పరిణామానికి నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కొన్ని లక్షల జనాభా కలిగిన నగరం ప్రస్తుతం కోటికిపైగా ప్రజలు నివసించే మహానగరంగా విస్తరించిందని ఐటీ మంత్రి చెప్పారు.ఐటీ, ఫార్మా, బయో టెక్నాలజీ, ఏరోస్పేస్, డిఫెన్స్, లైఫ్ సైన్సెస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలకు సిద్ధం కావాల్సి ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం రూపొందించి ప్రజల ముందు ఉంచిందని వివరించారు. 2034 నాటికి తెలంగాణను ఓ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ఘనంగా పోషణ మాసం కార్యక్రమాలు

### ....గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**రాయికల్ సెప్టెంబర్ 12(అక్షర కలం):**

రాయికల్ పట్టణంలోని రాయికల్--03 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఆకుకూరలు, పాలు, పండ్లు, చిరుధాన్యాలు, మిల్లెట్స్ తదితరాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని గర్భిణీలు, బాలింతలకు సూచించారు. చిన్నారులకు వయసుకు తగిన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని తెలిపారు.అనంతరం పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ తోపరపు ప్రశాంతి, అంగన్వాడీ టీచర్లు సింధూరి, సుమలత, పుష్పలత, ఆయా రాజమణి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి అసెంబ్లీలో నాకు ఎద్దు లేదు ఎవుసం లేదు నేను రియల్ ఎస్టేట్ బ్రోకర్ ను అని చెప్పుకున్నాడు

### మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి

**జగిత్యాల/సారంగాపూర్ సెప్టెంబర్ 12 (అక్షర కలం)**

రేచపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో మోటార్లకు మీటర్లు పెట్టాలని అనుకున్నప్పుడు అప్పుడు ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కచ్చితంగా తిరస్కరించారని. రైతులకు 24 గంటల ఆంక్షలు లేని కరెంటు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం అని కేసీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి కి మోడీ కి సంబంధం ఏంటో తెలియదు గానీ మీటర్లు పెట్టె ప్రక్రియ తెర వెనక ఆరంభింప చేయబడుతుందని అన్నారు మరోవైపు ట్రాన్స్ఫార్మర్లకు మీటర్లు పెట్టే ప్రక్రియ ఆరంభిస్తారని, ఉమ్మడి రాష్ట్రంలో 9 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చారు కెసిఆర్ యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ సింగరే పవర్ జెన్ కో ఆరంభింపజేశారు జెన్కో ద్వారా విద్యుత్ ఉత్పత్తి నాలుగంతలు పెంచారు



అదనంగా సోలార్ పవర్ కూడా ఆడ్ అయింది బట్టి విక్రమార్క శాసనమండలి లో ఎలినో ప్రభావం వల్ల విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామన్నారు ఎలినోకు విద్యుత్ ఉత్పాదనకు సంబంధమేంటి కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటి తరలింపుకు ఎలినో అడ్డంకి కాదని, ఎన్ డి ఎస్ ఏ వాళ్లు కూడా అన్నారం సుండిళ్ల చెక్కుచెదరలేదు అని అన్నారు. మేడిగడ్డలో 8 బ్లాక్స్ ఉన్నాయి అందులో 7 చెక్కుచెదరలేదు ఒక్క బ్లాక్లో నాలుగు పిల్లర్లు క్రాక్ వచ్చింది కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్ల అయితే దెబ్బ తిన్నది 200 కోట్లు మాత్రమే ఎల్ఎంటి వాళ్లే దాన్ని రిపేర్ చేస్తా అంటున్నారు అది మన ప్రభుత్వానికి ఖర్చు కాదు కాల్వ నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటే కాల్వ నీళ్లు ఇవ్వరు కరెంటు ఇచ్చే అవకాశం ఉన్న కరెంటు ఇవ్వరు ఆనాడు 24 గంటల కరెంటు ఇస్తే ఇప్పుడు 12 గంటలు ఇస్తున్నారు అది ఎప్పుడు వస్తది ఎప్పుడు పోతదో తెలియదు రేవంత్ రెడ్డికి సోయి బుద్ధి జ్ఞానం ఉండదా అని అన్నారు.రేవంత్ రెడ్డి అసెంబ్లీలో నాకు ఎద్దు లేదు ఎవుసం లేదు నేను రియల్ ఎస్టేట్ బ్రోకర్ ను అని చెప్పుకున్నాడు నేను మొన్న రైతులతో అన్న రేవంత్ రెడ్డి కి ఎద్దులేదు ఎవుసం లేదని దాన్ని రేవంత్ రెడ్డి ఒప్పుకున్నాడు వ్యవసాయం దండగ అని చెప్పినవాడు చంద్రబాబు నాయుడు ఇప్పుడు వీడు అదే చేస్తున్నాడు రేవంత్ రెడ్డి, యూరియా యాప్ అనేది రైతులకు ఎవరికీ అర్థం కావడం లేదని శిఖం భూములు చేసే దళిత బలహీనవర్గాలకు యూరియా అవసరం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడితే ఎంఆర్ఓ తో మాట్లాడమంటారు. ఎంఆర్ఓ ని అడిగితే పట్టా లేదు అంటారు రేవంత్ రెడ్డి లాగా భూముల బ్యారం చేద్దాం అన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ఉండంగా ఎకరానికి 50 లక్షల వస్తే ఇప్పుడు అమ్ముదాం అంటే 20 లక్షలు కూడా రావట్లేదని, మీటర్లు పెడితే రైతును బలి చేసినట్టే కదా అని అన్నారు. అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు పడి వ్యవసాయ బావులలో కొద్దిగా నీరు ఉన్నది కానీ కరెంటు లేదు సాగునీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం మరియు ఎరువుల సౌకర్యం కల్పించే బాధ్యత మీ పైన ఉందని, రబీలో ఈ సౌకర్యాలు లేకపోతే క్రాస్ హాలిడే ప్రకటించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు

## జగిత్యాల లో పాల ప్యాకెట్ కలకలం, పాలు గమ్ జిగురు రూపంలోకి మారింది...



**జగిత్యాల సెప్టెంబర్ 12 (అక్షర కలం)**

పట్టణంలో ఓ పాల ప్యాకెట్ కలకలం రేపింది. వాణి నగర్లోని ఓ డెయిరీ కేంద్రంలో కొనుగోలు చేసిన పాల ప్యాకెట్ ఫ్రిడ్జ్లో ఉంచిన అనంతరం జిగురు రూపంలోకి మారిందని బాధితుడు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, పాల నాణ్యతపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణంలోని వాణి నగర్లో ఉన్న చైతన్య డెయిరీ పాల కేంద్రంలో శనివారం ఉదయం లక్ష్మణ్ అనే వ్యక్తి పాల ప్యాకెట్ కొనుగోలు చేశారు. అనంతరం ఆ పాల ప్యాకెట్ను ఇంటికి తీసుకెళ్లి ఫ్రిడ్జ్లో ఉంచారు. కొంతసేపటి తర్వాత ప్యాకెట్ను విప్పి చూడగా పాలు గమ్ జిగురు) రూపంలోకి మారిపోయినట్లు గుర్తించిన బాధితుడు ఒక్కసారిగా షాక్కు గురయ్యాడు. దీంతో వెంటనే సంబంధిత పాల కేంద్రానికి వెళ్లి డెయిరీ నిర్వాహకుడిని నిలదీశాడు. అయితే తన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండా మరో పాల ప్యాకెట్ ఇస్తానంటూ నిర్వాహకుడు బలవంతం చేసినట్లు బాధితుడు ఆరోపించాడు.ఈ ఘటనతో స్థానిక ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలల్లో ఏవైనా కల్తీ రసాయనాలు కలిపారా? లేక నకిలీ పాలను విక్రయిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా వినియోగించే పాల విషయంలో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఇలాంటి ఘటనలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే స్పందించి, సంబంధిత పాల నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నాణ్యత లేని లేదా కల్తీ పాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మొన్న ఒకరు.. నిన్న మరొకరు.. రేపెవరో?

### దడపుట్టిస్తున్న ఏసీబీ దాడులు.. అయినా మారని అవినీతి తీరు

రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరుస దాడులతో లంచావతారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నప్పటికీ, కొందరు అధికారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. చిన్న ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు 'చేయి తడిపితేనే పని.. జేబు నిండితేనే సంతకం' అన్న చందంగా వ్యవస్థ తయారైంది. సామాన్యుడి కష్టాన్ని సైతం సొమ్ము చేసుకుంటూ ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి పీల్చిపిప్పి చేస్తున్నారు. అవినీతిని కూకటివేళ్లతో పెకిలించేందుకు ఏసీబీ అధికారులు నిరంతరం నిఘా వేస్తూ రెడ్ హ్యాండెడ్గా పట్టుకుంటున్నా, అక్రమార్జనతో కోట్లు గడించి విలాసవంతమైన జీవితాన్ని గడపవచ్చనే దురాశతో లంచాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది.ఇటీవల ఏసీబీ నమోదు చేస్తున్న వరుస కేసులు ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు అందించే సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) మెడికల్ రీయింబర్స్మెంట్ చెక్కు కోసం సచివాలయ ఔట్సోర్సింగ్ ఉద్యోగి, టీఎస్ఐడీసీ సీనియర్ అసిస్టెంట్ ఏకంగా రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. మరోవైపు నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణ పత్రం (క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్) జారీకి ముషీరాబాద్ డివిజన్ డీఈఈ రూ. 10 వేలు తీసుకుంటూ చిక్కారు. చివరకు ఖైదీల ములాఖత్, సౌకర్యాల కల్పన కోసం హుజూరాబాద్ సబ్ జైలు డిప్యూటీ జైలర్, కుటుంబ వివాదాల పరిష్కారం పేరుతో టోలిచౌకి సబ్ ఇన్స్పెక్టర్ సైతం ఏసీబీ వలలో పడటం లంచాల దందా ఎంతటి స్థాయికి దిగజారిందో స్పష్టం చేస్తోంది.నారాయణపేట జిల్లాలోనూ ఏసీబీ దాడులు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం ఐదు బర్త్ సర్టిఫికెట్ల జారీ కోసం రూ. 25 వేలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటూ ఆర్డీవో రాంచందర్ నాయక్ ఏసీబీకి చిక్కారు. ఆ సంఘటన మరువక ముందే, జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం రూ. 90 వేల లంచం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ లగిశెట్టి వెంకటస్వామిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సొంత ఉమ్మడి జిల్లాలోనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల్లో దళారులు సైతం తిష్టవేసి, అధికారుల పేరిట రేట్లు ఫిక్స్ చేస్తూ సామాన్యులను దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7 కింద 3 నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నప్పటికీ అధికారుల్లో భయం కనిపించడం లేదు. ముఖ్యంగా నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జోరుగా సాగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చాలామంది బాధితులు అధికారులపై ఫిర్యాదు చేయడానికి, రెడ్ హ్యాండెడ్గా పట్టించడానికి భయపడుతున్నారని, అధికారులు కేవలం ఫిర్యాదుల కోసమే ఎదురుచూడకుండా ధన్వాడ మండలంలో జరుగుతున్న అవినీతిపై సుమోటోగా దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.







## మండల స్థాయి పోటీలలో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు...



**వీణవంక, సెప్టెంబరు 12 ( అక్షర కలం ):**

వీణవంక మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ వీణవంక పాఠశాల క్రీడా ప్రాంగణంలో సెప్టెంబర్ 9 నుండి సెప్టెంబర్ 11 వరకు జరిగిన ప్రభుత్వ పాఠశాలల మండల స్థాయి క్రీడా పోటీలలో కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటి, ప్రథమ స్థానంలో నిలిచి పథకాలను సొంతం చేసుకున్నారు. కేజీబీవీ విద్యార్థులు అండర్ 14 కో కో బాలికల విభాగంలో గెలిచి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే అండర్ 14, అండర్ 17 షాట్ పుట్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం నిలిచి కేజీబీవీ క్రీడాకారులు తమ సత్తాను చాటారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను మెడల్స్ తో సత్కరించారు. కేజీబీవీ ఎస్ ఓ , ఉపాధ్యాయ బృందం గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. అలాగే గెలుపుకు ప్రత్యేక శిక్షణ అందించిన పిఈటి మేడం ను ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా ప్రశంసించారు.అనంతరం ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు మాట్లాడుతూ... ప్రతిరోజు ఆటలలో ప్రత్యేక నైపుణ్యత కలిగిన శిక్షణను ఇస్తూ, ఆటలలో మెలకువలు జాగ్రత్తలు సూచిస్తూ, మమ్మల్ని వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న మా పాఠశాల పిఈటి కి ఋణపడి ఉన్నామంటూ, పీఈటి టీచర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోషకాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యం

గర్భిణులు పోషకాహారంపై శ్రద్ధ పెట్టాలి



**కరీంనగర్, సెప్టెంబర్12 ( అక్షర కలం ):**

గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి సూచించారు. కుటుంబ సభ్యులు కూడా వారికి పౌష్టికాహారం అందేలా ప్రోత్సహించాలని అన్నారు. ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్కండేయ నగర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, సీడీపీఓ కవిత హాజరయ్యారు.ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ మహిళల్లో ఐరన్ లోపాన్ని నివారించేందుకు మునగ, బచ్చలి, ఇతర ఆకుకూరలు, పల్లీలు, బెల్లం వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సీజన్లో లభించే పండ్లు, తాజా కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు బరువు, ఎత్తును పరీక్షించుకోవాలని తెలిపారు. తక్కువ బరువున్న పిల్లల కోసం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా బాలామృతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నెలలు నిండిన గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీడీపీఓ కవిత వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లులకు క్విజ్ నిర్వహించారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు





**ధర్మపురి సెప్టెంబర్ 12 (అక్షర కలం)**

భాద్రపద శుద్ధ ప్రతిపద సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉన్న ఇతర దేవాలయాల్లోని స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ధర్మపురి ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు



పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే ముమ్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మీసేవ నిర్వాహకుల హక్కులపై రాజీలేని పోరాటం

**నిర్వాహకుల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్నాం**

**వినియోగదారులకు నిబద్ధతతో సేవలు అందించాలి**

**తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్**

**సిద్దిపేటలో తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా సమావేశం.. నూతన కార్యవర్గం ఏర్పాటు**

**అక్షర కలం సిద్దిపేట, సెప్టెంబర్ 12:**

మీసేవ నిర్వాహకుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ మీసేవ ఫెడరేషన్ ఆవిర్భావం నుంచీ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైర శంకర్ స్పష్టం చేశారు. నిర్వాహకుల ప్రయోజనాల కోసం సంఘం నిరంతరం శ్రమిస్తోందని, సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో



అసోసియేషన్లను బలోపేతం చేసుకొని, ఎదురవుతున్న సమస్యలను సంఘం దృష్టికి తెచ్చి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. జీవో 4 ప్రకారం జిల్లా, మండల రెవెన్యూ అధికారులకు గానీ, ఏ ఇతర అధికారులకు గానీ మీసేవ కేంద్రాలను సీజ్ చేసే అధికారం లేదని తేల్చి చెప్పారు. మీసేవ నిర్వాహకులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ సంఘంలో సభ్యుడిగా ఉన్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య నిర్వాహకులు వారధిగా నిబద్ధతతో పని చేస్తూ సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం త్వరలోనే మీసేవ కేంద్రాలలో పహాణీలతో పాటు ఇతర భూ రికార్డుల సేవలను మళ్లీ అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కేంద్రాలకు వచ్చే వినియోగదారుల నుంచి సిటిజన్ ఛార్టర్‌లో పేర్కొన్న రుసుములను మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏరోళ్ల బాలరాజు, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మొహిద్, లీగల్ అడ్వైజర్ రాయల ఉదయ్ కుమార్, కల్చరల్ సెక్రటరీ బురుగు ముకేష్, జిల్లా అధ్యక్షుడు చుక్క భరత్, ప్రధాన కార్యదర్శి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గం..

సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా చుక్క భరత్ కుమార్, ఉపాధ్యక్షులుగా కొత్త సంపత్ కుమార్, ఎలుక నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అనంతారం నగేష్, సహాయ కార్యదర్శులుగా కండ్లకోయ పరుశరాములు, గాదగోని రమేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా సుంకర శ్రీనివాస్, కోశాధికారిగా ఉప్పరి మహేష్, సహాయ కోశాధికారులుగా లెంకల రఘు, ఎండి ఇస్తాక్, కల్చరల్ సెక్రటరీగా తీగల చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా జయప్రకాశ్ రెడ్డి, నారదాసు పోశెట్టి, చొప్పదండి సాయి కృష్ణ, కాపర్తి పవన్, గర్రెపల్లి వెంకటేశం, మహిళా విఎల్ఈ కోఆర్డినేటర్ గా కాంతారెడ్డి మంజుల, మానాల తిరుమల, మీడియా ఇన్చార్జిగా వడ్డేపల్లి ప్రకాష్, స్పోక్ పర్సన్ గా రమేష్ చంద్ర, సలహాదారుగా కరుణాకర్ లీగల్ అడ్వైజర్ గా కస్తూరి భూంరెడ్డి ఎన్నికైనారు.

# అధికారుల పని ఒత్తిడికి అంగన్వాడీ టీచర్ విజయ బలి?

**ఇంటింటి సర్వేలు.. వరుస ఆదేశాలు.. తీవ్ర పని ఒత్తిడి**

**గద్వాల్ ఆర్ఐ వేధింపుల వల్లే మృతి జరిగిందని కుటుంబ సభ్యుల ఆరోపణ**

**అంగన్వాడీ సిబ్బందిని ఉద్యోగులుగా చూస్తున్నారా.. పనిముట్లుగా చూస్తున్నారా?**

**విజయ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండల వెంకట్ రాములు**

**గద్వాల్ టౌన్ అక్షరకలం**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్, 25వ వార్డుకు చెందిన అంగన్వాడీ టీచర్ శ్రీమతి విజయ మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. అయితే ఆమె మృతిపై కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గద్వాల్ ఆర్ఐ వేధింపులు, అధికారుల పని ఒత్తిడి, ఇంటింటి సర్వేలు, వరుస ఆదేశాల కారణంగానే విజయ తీవ్ర ఒత్తిడికి గురై ఆరోగ్యం దెబ్బతిని ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**గద్వాల్ ఆర్ఐ వేధింపులే కారణమా?**

విజయ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గద్వాల్ ఆర్ఐ నుంచి ఎదురైన వేధింపులు, ఒత్తిడి కారణంగానే ఆమె తీవ్ర మానసిక వేదనకు గురైందని, చివరకు ప్రాణాలు కోల్పోయిందని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఆర్ఐ పాత్రపై కూడా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు





కోరుతున్నారు.విజయపై ఎలాంటి ఒత్తిడి వచ్చింది? ఆర్ఐ నుంచి ఎలాంటి ఆదేశాలు లేదా వేధింపులు ఎదురయ్యాయి? ఆమెకు అప్పగించిన విధులు ఏమిటి? అనే అంశాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

**ఆదేశాల మీద ఆదేశాలు.. సిబ్బందిపై ఒత్తిడి?**

అంగన్వాడీ సిబ్బందికి ఇప్పటికే ఉన్న బాధ్యతలకు తోడు ఇంటింటి సర్వేలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, నివేదికలు, అదనపు విధులు అప్పగిస్తూ పని భారం పెంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు విధులు నిర్వహించాల్సి ఉండగా.. మరోవైపు అధికారుల నుంచి వరుస ఆదేశాలు, ఒత్తిడి ఎదురవుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ సిబ్బంది ఉద్యోగులా.. పనిముట్లా?

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే వారి సేవలను వినియోగించుకోవడంలో చూపుతున్న శ్రద్ధ.. వారి ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.పని చేయించుకోవడమే లక్ష్యమా? సిబ్బంది ఆరోగ్యం, ప్రాణాలకు విలువ లేదా? అంటూ బాధిత కుటుంబం, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**విజయ మృతికి బాధ్యులు ఎవరు?**

విజయ మృతికి ముందు ఆమెకు ఎలాంటి విధులు అప్పగించారు? ఎంత పని భారం మోపారు? అదనపు విధులు ఎవరి ఆదేశాల మేరకు అప్పగించారు? గద్వాల్ ఆర్ఐ నుంచి ఆమెకు ఎలాంటి ఒత్తిడి లేదా వేధింపులు ఎదురయ్యాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

**కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నేత**

విజయ మృతి విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండల వెంకట రాములు విజయ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.విజయ మృతికి సంబంధించిన విషయాన్ని ఎంపీ డీకే అరుణమ్మ గారి దృష్టికి తీసుకెళ్లాలని మండల వెంకట రాములు ను కుటుంబ సభ్యులు కోరినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయిలో స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

విజయ మృతిపై జిల్లా కలెక్టర్, మహిళా--శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. గద్వాల్ ఆర్ఐ వేధింపులే మృతికి కారణమని వస్తున్న ఆరోపణలపై కూడా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు విచారణలో నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విజయ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని కోరుతున్నారు.

**ఇకనైనా అధికారుల తీరు మారాలి**

అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వానికి అవసరమైన సేవలు అందిస్తున్నప్పటికీ.. వారి ప్రాణాలు, ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది.విజయ మృతి ఒక్క కుటుంబానికి జరిగిన విషాదంగా మిగలకుండా.. అధికారుల పని ఒత్తిడి, వేధింపులు, అదనపు విధులపై ప్రభుత్వం దృష్టి సారించేలా హెచ్చరికగా మారాలి.

పని ఒత్తిడికి హద్దు ఉండాలి.. ఉద్యోగుల ప్రాణాలకు విలువ ఉండాలి. విజయ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# యోగా విన్యాసాల్లో మోక్షిత సత్తా!

**రాష్ట్రస్థాయి పోటీలకు ఏవీఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక**

**కరీంనగర్‌లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న మోక్షిత**

**గండీడ్, సెప్టెంబరు 12. అక్షర కలం:**

యోగాసనాల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తూ గండీడ్ మండలానికి చెందిన విద్యార్థిని మోక్షిత తన సత్తా చాటుతోంది. మండల కేంద్రంలోని ఏవీఆర్ గ్లోబల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న మోక్షిత యోగా క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి యోగా క్రీడల పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను ప్రదర్శిస్తోంది.

చిన్న వయసులోనే యోగాపై ఆసక్తి పెంచుకున్న మోక్షిత.. నిరంతర సాధన, పట్టుదలతో పోటీల్లో రాణిస్తోంది.



పాఠశాలలో యోగా శిక్షణ పొందుతూ నిత్యం సాధన చేయడం, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పోటీల్లో సమర్థంగా ప్రదర్శించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. కరీంనగర్‌లో జరుగుతున్న పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో సత్తా చాటాలని మోక్షిత లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రోత్సాహంతోనే ప్రతిభకు పదును

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ప్రిన్సిపాల్ అంజయ్యగౌడ్ తెలిపారు. యోగా సాధనతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మోక్షిత మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

మోక్షితను ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన యోగా ఉపాధ్యాయురాలు బాలమణిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థినికి నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులను సైతం అభినందించారు. కరీంనగర్ పోటీల్లో మోక్షిత విజయవంతంగా రాణించి పాఠశాలకు, గండీడ్ మండలానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వెంకట్రాములు, రమేష్, వెంకటస్వామి, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని విద్యార్థిని మోక్షితను అభినందించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం

### కర్లోస్ అల్కరాస్?కు క్వార్టర్ ఫైనల్?లో భారీ షాక్

### అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్? చేతిలో ఓటమి

యూఎస్ ఓపెన్?లో మరో సంచలనం నమోదైంది. డిఫెండింగ్ ఛాంపియన్ స్పానిష్ టెన్నిస్ స్టార్ కర్లోస్ అల్కరాస్?కు క్వార్టర్ ఫైనల్?లో భారీ షాక్ తగిలింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన అతడిని బెన్ షెల్టన్ (అమెరికా) ఓడించాడు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్?లో అల్కరాస్?పై బెన్ షెల్టన్ 6-7, 6-1, 6-3, 1-6, 7-6 (10-7) తేడాతో నెగ్గాడు. దీంతో ట్రోఫీని నిలబెట్టుకోవాలని భావించిన అల్కరాస్ ఊహించని ఈ ఓటమితో? ఇంటిబాట పట్టాడు.న్యూయార్క్‌లోని ఆర్థర్ యాశ్ స్టేడియంలో జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్? మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్?తో అల్కరాస్? తలపడ్డాడు. నాలుగు గంటలపాటు ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. గాయం తర్వాత నేరుగా ఈ గ్రాండ్?స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన అస్కరాస్ తొలి రౌండ్?లో అతి కష్టంమీద నెగ్గాడు. ఈ సెట్‌ను టై బ్రేక్‌లో గెలుచుకున్నాడు. అయితే తర్వాత రెండు సెట్లలో బెన్ షెల్టన్? జోరు ప్రదర్శించాడు. వరుసగా రెండు, మూడు సెట్లను 6-1, 6-3 తేడాతో గెలుచుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. పట్టు వదలని అల్కరాస్ నాలుగో సెట్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ 6-1తో సెట్‌ను గెలుచుకున్నాడు. ఇక నిర్ణయాత్మకమైన ఐదో సెట్ తీవ్ర ఉత్కంఠతకు దారి తీసింది. పోటీ హోరాహోరీగా సాగింది. ఈ ఇద్దరు 6- 6తో సమంగా నిలిచారు. దీంతో గేమ్ టై- బ్రేక్‌కు వెళ్లింది. అయితే టై- బ్రేక్‌లో షెల్టన్ 10-7తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా, అల్కరాజ్‌పై షెల్టన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. 23 ఏళ్ల అల్కరాస్ తమ కెరీర్?లో ఎనిమిదో గ్రాండ్?స్లామ్ టైటిల్ గెలవాలనే ఆశతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టాడు. కానీ, ఈ ఓటమితో ఆ కల చెదిరిపోయింది. కాగా, అల్కరాస్ ఇప్పటిదాకా రెండుసార్లు (2022, 2025) ఖూ ఓపెన్ టైటిల్ దక్కించుకున్నాడు. దీంతోపాటు ఒకసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ (2026), రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), రెండుసార్లు వింబుల్డన్ (2023, 2024) గ్రాండ్?స్లామ్? టైటిళ్లు సాధించాడు. మరోవైపు ఇంకో క్వార్టర్ ఫైనల్?లో టియాఫో - మికెల్సన్ తలపడ్డారు. నాలుగున్నర గంటలపాటు సాగిన ఈ మ్యాచ్?లో మికెల్సన్?పై 5-7, 3-6, 7-5, 6-3, 7-6 (10-6) తేడాతో టియాఫో విజయం సాధించి సెమీస్?కు దూసుకెళ్లాడు.ఇక సెమీఫైనల్‌లో ఫ్రాన్సెస్ టియాఫోతో షెల్టన్ తలపడనున్నాడు. 23 ఏళ్ల షెల్టన్ తన మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతను ఇప్పటివరకు మేజర్? గ్లాండ్?స్లామ్ టైటిల్ నెగ్గలేదు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2023 ఖూ ఓపెన్ సెమీఫైనల్స్ వరకు వెళ్లడం అతడికి అత్యుత్తమ ప్రదర్శనలు.ఇదే టోర్నమెంట్?లో రీసెంట్?గా సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్?కు తొలి రౌండ్?లోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అతడిని మారియానో ??నావోన్? (అర్జెంటీనా) 7-6, 5-7, 6-4, 2-6, 6-1 తేడాతో ఓడించి సంచలనం సృష్టించాడు.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు.

# రంజీ ట్రోఫీ షెడ్యూల్ మార్పులపై గవాస్కర్ ఆగ్రహం

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రూపొందించిన దేశవాళీ షెడ్యూల్‌పై టీమ్ ఇండియా దిగ్గజ మాజీ సారథి సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెడ్ బాల్ టోర్నీ రంజీ ట్రోఫీని బోర్డు చిన్నచూపు చూస్తోందని విమర్శించాడు. ప్రస్తుత క్యాలెండర్ ప్రకారం రంజీ ట్రోఫీని రెండు దశలుగా విభజించి, వాటి మధ్యలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ షెడ్యూలింగ్ గందరగోళంపై స్పోర్ట్‌స్టార్ కాలమ్‌లో గవాస్కర్ స్పందిస్తూ, “ఒక వైట్ బాల్ టోర్నమెంట్ కోసం రెడ్ బాల్ టోర్నమెంట్‌ను మధ్యలోనే ఎలా ఆపేస్తారు? ఇది ఆటగాళ్ల రిథమ్, మొమెంటమ్‌ను పూర్తిగా నాశనం చేస్తుంది” అని ఆవేదన చెందాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని సెప్టెంబర్‌లోనే నిర్వహించవచ్చని, కానీ ఐపీఎల్ వేలానికి సమీపంలో ఉండాలనే ఉద్దేశంతోనే బీసీసీఐ ఇలా చేస్తోందని గవాస్కర్ విమర్శించాడు. “రంజీ ట్రోఫీ తరహాలోనే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని కూడా క్వార్టర్ ఫైనల్ వరకు ఆడి, కొద్ది వారాల విరామం తర్వాత సెమీస్, ఫైనల్స్ నిర్వహించవచ్చు కదా? అలా చేయరు. ఎందుకంటే ఈ టోర్నీ ముగిసిన వెంటనే ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఒకవేళ వేలం రెండు నెలల తర్వాత జరిగినా ఫ్రాంచైజీలు ప్రతిభావంతులైన ఆటగాళ్లను మరిచిపోరు” అని అతడు తెలిపాడు. ఆట అసలు సిసలైన పునాది అయిన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌ను పక్కనపెట్టి లీగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదని తెలిపాడు. ప్రస్తుత బీసీసీఐ వ్యవస్థలో అనుభవం లేని వ్యక్తుల జోక్యం పెరగడం వల్లే ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వస్తున్నాయని గవాస్కర్ విమర్శించాడు. గతంలో బోర్డులో టెక్నికల్ కమిటీ, ఫిక్చర్స్ కమిటీ ఉండేవని గుర్తుచేశాడు. “గతంలో మాజీ ఆటగాళ్లు, సీనియర్ అంపైర్లు, అనుభవజ్ఞులైన నిర్వాహకులు ఆ కమిటీల్లో సభ్యులుగా ఉండి మ్యాచ్‌ల నిర్వహణ సజావుగా సాగేలా చూసేవారు. అలాంటి అనుభవజ్ఞుల సేవలను మళ్లీ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత భారత క్రికెట్ వ్యవస్థ కాస్త దారితప్పింది, సరైన నిపుణుల సలహాలతో దాన్ని సరిచేయాలి” అని సూచించాడు. టెస్ట్ క్రికెట్‌కు ఆటగాళ్లను అందించే రంజీ ట్రోఫీ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గకుండా చూడాలని, షెడ్యూలింగ్ లో నిలకడ లేకపోతే యువ క్రికెటర్ల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్

తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీకి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వగత తాజా పోస్టులో మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. ఆ వ్యక్తి ప్రస్తుతం ఓ భక్తి ప్రధానమైన సినిమాకు సంగీతం అందిస్తున్నారని తెలిపింది. ఈ ఒక్క అంశం సోషల్ మీడియాలో చర్చకు మరింత ఆజ్యం పోసింది. అంతే కాదు.. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని బహిరంగ కార్యక్రమాలకు ఆహ్వానించడం, వేదికపై అతడికి కేక్ తినిపిస్తున్నారనీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ పరిశ్రమ ఎవరి పక్షాన నిలబడుతుందనీ ప్రశ్నించింది. ఇక చివరిలో ‘నెక్ట్స్..’ అంటూ తన ట్విట్ ముగించింది సింగర్ స్వగత. ఇలాంటి ఉత్కంఠ రేపడంతో త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించబోతున్నారా? ఇప్పటివరకు చెప్పని విషయాలను బయటపెట్టబోతున్నారా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే ఆమె గత ఆరోపణలపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగిన నేపథ్యంలో.. తాజా పోస్టు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆమె తదుపరి పోస్టులో ఏదైనా వ్యక్తి పేరు లేదా కీలక ఆధారం బయటపెడతారా అన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది.





# అతన్ని ప్రేమించి మోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు.

# ‘సీక్రెట్ సోల్జర్’ నుంచి సాంగ్ రిలీజ్

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా ‘సీక్రెట్ సోల్జర్’. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# రాష్ట్ర గౌడ సంక్షేమ మహిళా ఉపాధ్యక్షురాలిగా బీసు ధనలక్ష్మి

ఆత్మకూరు (ఎం) అక్షరకలం

హైదరాబాద్ లో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గట్టు రాంచంద్రయ్య గౌడ్ చేతుల మీదిగా నియామక పత్రం అందించటం జరిగింది. ఈ సందర్భంగా బిస్ ధనలక్ష్మి మాట్లాడుతూ నన్ను రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం మహిళా ఉపాధ్యక్షురాలుగా నియమించిన జాతీయ అధ్యక్షులు గట్టు రామచంద్రయ్య గౌడ్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్టంలో గౌడ సంక్షేమ సంఘం మహిళ అభివృద్ధికి నేను సహకారం అందిస్తాను, అన్ని రంగాలలో గౌడ మహిళలు ముందుకు వచ్చేలా సమన్వయము చేస్తాము అని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్,గౌడ సంక్షేమ సంఘం ఆత్మకూర్(ఎం) మండల మహిళ విభాగం అధ్యక్షురాలుగా పొన్నగాని జయశ్రీ జహంగీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఇన్చార్జి బాధ్యతలను తక్షణమే రద్దు చేయాలి -- ఎస్ఎఫ్ఐ డిమాండ్



అక్షరకలం నల్గొండ

ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో నిబంధనలకు విరుద్ధంగా నూతన వార్డెన్లకు ఇచ్చిన ఇన్చార్జి బాధ్యతలను తక్షణమే తొలగించాలని, స్థానికంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న అధికారులకే ఆ బాధ్యతలు అప్పగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ఎఫ్ఐ ) నల్లగొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డిడి )కు ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ... నల్లగొండ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఇటీవల ఉద్యోగుల బదిలీల్లో భాగంగా సూర్యాపేట జిల్లాకు బదిలీ అయినప్పటికీ, పైరవీలు చేసి మళ్ళీ నల్లగొండకు డిప్యూటేషన్‌పై రావడం వెనుక ఉన్న అంతర్యం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే ఆ సూపరింటెండెంట్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ?అలాగే, జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో ఒక నియోజకవర్గంలోని అధికారికి మరొక నియోజకవర్గంలోని హాస్టల్ ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం ఇన్చార్జి బాధ్యతలను స్థానికంగా ఉన్న వార్డెన్లకు కాకుండా, ఏకంగా 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకొండలో నూతనంగా ఉద్యోగం పొందిన అనుభవం లేని వార్డెన్‌కు అప్పగించారని తెలిపారు. ? మునుగోడు నియోజకవర్గం నాంపల్లి ఎస్సీ బాలుర వసతి గృహ అధికారిపై విద్యార్థులు లేకుండానే బిల్లులు డ్రా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, జూన్ నెలలో కొత్తగా చేరిన ఇతనికి నాంపల్లి లో విధులు సరిగ్గా నిర్వహించడమే రాకపోయినా, 42 కిలోమీటర్ల దూరంలోని మల్లేపల్లి ఎస్సీ హాస్టల్ ఇన్చార్జి బాధ్యతలు ఎందుకు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ? నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన ఈ నియామకాలను వెంటనే రద్దు చేసి, స్థానిక నియోజకవర్గ పరిధిలోని అనుభవజ్ఞులైన అధికారులకే ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పాలకవర్గ విధానాలపై పోరాడాలి

--సిఐటియు జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి



అక్షరకలం బిబినగర్

?తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో పాలకవర్గాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బీబీనగర్‌లో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని, దీని వల్లే భూ సంస్కరణలు వచ్చాయని పేర్కొన్నారు.? పోరాటంలో పాత్రలేని ఆర్ఎస్ఎస్, బీజేపీలు దీనిని మతాల మధ్య ఘర్షణగా వక్రీకరిస్తున్నాయని, అన్ని వర్గాల ప్రజలు నైజాం దోపిడీకి వ్యతిరేకంగానే పోరాడారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి జరుగుతున్న మత రాజకీయాలను కార్మికులు, ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రైతు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో పలువురు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

అక్షరకలం బిబినగర్

తెలంగాణ విమోచన దినోత్సవం 17 సెప్టెంబర్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీబీనగర్ మండల తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి కి బీబీనగర్ బిజెపి మండల అధ్యక్షులు భువనగిరి సదానంద గౌడ్ ఆధ్వర్యంలో మెమోరంటం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోయపల్లి గోపాల్ రెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇంజమూరి ప్రభాకర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు కాసుల శ్రీకాంత్ గౌడ్ గూడూరు శ్రీనివాసరెడ్డి బాబుజాని తదితరులు పాల్గొన్నారు.



# నల్గొండ జిల్లా రైతులకు గమనిక

-- డిజిటల్ క్రాప్ సర్వేలో పంట వివరాల నమోదు తప్పనిసరి

-- ఈనెల 30 వరకు గడువు

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలోని రైతులు సాగు చేసిన పత్తి, వరి, కంది, ఉద్యానవన పంటలతో పాటు వర్షభావ పరిస్థితుల వల్ల వేసిన ప్రత్యామ్నాయ పంటల వివరాలను సేకరించేందుకు ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహిస్తోంది. దాదాపు అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న వడ్లను సాగు చేసిన వారికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ కూడా వర్తిస్తుంది. దీని కోసం గ్రామాలలో నియమించబడిన సర్వేయర్లు ప్రతి చేనుకు వెళ్లి ఫోటోలు తీసి సర్వే ద్వారా పంట వివరాలను నమోదు చేస్తున్నారు. ఇలా చేయడం వలన ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేశారో స్పష్టంగా తెలియడమే కాకుండా, ఈ సర్వే వివరాలు పంటల కొనుగోలు ప్రక్రియకు అనుసంధానించబడి ఉండడం వల్ల ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. కావున గ్రామాల్లో ఈ సర్వే జరుగుతున్నప్పుడు రైతులు స్వయంగా సర్వేయర్ల వెంట వెళ్లి తమ పంట చేను వద్ద సాగు చేసిన పంటను, ముఖ్యంగా వరి పంట అయితే ఏ రకం వేశారనే వివరాలను స్పష్టంగా నమోదు చేయించుకోవాలి. ఈ డిజిటల్ క్రాప్ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవడానికి ఈనెల 30 వరకు గడువు వుంది అని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# దేవరకొండ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన 'టాస్క్' శిక్షణ

అక్షరకలం దేవరకొండ



స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 'తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయి. నాంది ఫౌండేషన్ భాగస్వామ్యంతో 'మహీంద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్' పేరిట ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాల సాధనకు అవసరమైన 18 రకాల అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ముఖ్యంగా మనీ మేనేజ్‌మెంట్, ఇంటర్వ్యూ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, పబ్లిక్ స్పీకింగ్ (వక్తృత్వ కళ), క్రిటికల్ థింకింగ్, ప్రాజెక్ట్ ప్రజెంటేషన్, కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ వంటి కీలకమైన అంశాల్లో ట్రైనర్ డి. సుధీర్ విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, ఉద్యోగ పోటీ పరీక్షల్లో రాణించడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని టాస్క్ కోఆర్డినేటర్ ఐస్. జ్యోతి, సిజిసి కోఆర్డినేటర్ జి.పి. జ్ఞానేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఏచూరి ఆశయ సాధనే ఆయనకు ఘన నివాళి

--సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ పార్లమెంటేరియన్ కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కార్యాలయమైన దొడ్డి కొమురయ్య భవన్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి సేవలను, ఆయన పోరాట పటిమను గుర్తుచేసుకున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీయేతర పార్టీలన్నింటినీ ఒకే వేదికపైకి తెచ్చి 'ఇండియా' కూటమి ఏర్పాటు చేయడంలో ఏచూరి కీలక సూత్రధారిగా వ్యవహరించారు. గత 12 ఏళ్లుగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు, మతోన్మాద ఎజెండాను అడ్డుకోవడానికి కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేస్తూ ఆయన నిరంతరం పోరాడారు. 1970లలో విద్యార్థి నాయకుడిగా



ప్రస్థానం ప్రారంభించి, 1983లోనే ప్రధాని ఇందిరాగాంధీ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ధీరుడు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా, ఆడంబరాలను పక్కనపెట్టి 50 ఏళ్ల పాటు పేదలు, కార్మికులు, దళితుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేశారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, మలయాళం, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఏచూరి... నేపాల్ మావోయిస్టులు ఆయుధాలు వదిలి పార్లమెంటరీ రాజకీయాల్లోకి రావడంలో ముఖ్యమైన సలహాదారుగా వ్యవహరించారు. 2006 యూపీఏ-1 ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టాల రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆయన లేకపోవడం కమ్యూనిస్టు ఉద్యమానికే కాకుండా మొత్తం భారత రాజకీయ రంగానికి తీరని లోటని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు ఎండి. సలీం, గంజి మురళీధర్, పుచ్చకాయల నర్సిరెడ్డి, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పట్టణ, మండల కమిటీ తుమ్మల పద్మ, అవుట రవీందర్, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, దండెంపల్లి సరోజ, అద్దంకి నరసింహ, బొల్లు రవీందర్, కొండ వెంకన్న సలివోజు సైదాచారి, కొత్త అంజయ్య, పుప్పాల మట్టయ్య, పుష్పలత, గంజి రాజేష్, శ్రీ వాణి, సుష్మ, రజిని,మారయ్య తదితరులు పాల్గొన్నారు

# నల్గొండలో విజయవంతంగా జాతీయ లోక్ అదాలత్

-- 12,283 కేసుల పరిష్కారం

-- రూ. 8.55 కోట్లకు పైగా పరిహారం పంపిణీ

అక్షరకలం నల్గొండ

రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నల్గొండ ఆధ్వర్యం శనివారం జిల్లా లోని అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడింది. ఈ లోక్ అదాలత్ కోసం జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ లోక్ అదాలత్ లో 33 - సివిలు, 2813 - క్రిమినలు, 68- మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 9281- ట్రాఫిక్ చలాన్ కాసులు, 77 - బ్యాంకు రికవరీ కేసులు, 11 - సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం -- 12283 (పెండింగ్, ప్రి-లిటిగేషన్) కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో ప్రమాద భీమా కేసులలో రూ.7,62,44,348 నష్టపరిహారం ఇప్పించగా బ్యాంకు రికవరీ రూ.6217000 ట్రాఫిక్ చలాన్ 31,32,180 సైబర్ క్రైమ్ కేసులలో రూ.117262/- రికవరీ డబ్బులు యిప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి, చైర్మన్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పి. వసంత్, కార్యదర్శి హిమబిందు గొల్ల, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ. సతీష్ కుమార్, బి.అశోక్ కుమార్, ఇతర న్యాయవాదులు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ అండ్ ఇతర ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫీసర్స్, కక్షిదారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ట్రాక్టర్‌పై నుంచి జారిపడి బాలుడు మృతి

నాగారం సెప్టెంబర్ 12 (అక్షర కలం)

ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందిన సంఘటన శాంతిగర్ శివారులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తుంగతుర్తి నియోజకవర్గ నాగారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందన షేక్.కమాల్--సైదాబి దంపతులకు షేక్.అక్బర్, షేక్ అన్వర్ ఇద్దరు కుమారులు. వీరిలో చిన్న కుమారుడైన షేక్. అన్వర్ (15) ట్రాక్టర్ పని నిమిత్తం రాయి వేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో రాయిని లోడ్ చేసుకొని తిరిగి వస్తుండగా ట్రాక్టర్ ఇంజన్‌కు తొట్టికి మద్యలో ఇనుప కడ్డిపై నిలబడ్డాడు. వర్షానికి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో అన్వర్ పై నుంచి ట్రాక్టర్ తొట్టి వెళ్లడంతో అక్కడిక్కక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



# జూన్ నాటికి ఉప్పల్-- నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి

హైదరాబాద్,



హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నప్పటికీ పలు కారణాల వల్ల నిర్మాణం అనుకున్న సమయానికి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తీసుకురావాలని గతంలో భావించారు. అయితే కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన సమస్యలు, న్యాయపరమైన అంశాలు తదితర కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ప్రాజెక్టు కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో నిర్మాణ ప్రక్రియలో అంతరాయం ఏర్పడిందని మంత్రి వివరించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయలేకపోయామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అవరోధాలను తొలగించి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారి--163పై ఉప్పల్--నారపల్లి మధ్య ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో మూడేళ్లలోనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ వివిధ కారణాలతో ప్రాజెక్టు గడువు పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు తూర్పు దిశగా ప్రయాణించే వాహనాలకు గణనీయంగా ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని వరంగల్, భువనగిరి, జనగామ ప్రాంతాలతో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌తో అనుసంధానించడంలో ఈ మార్గం కీలకంగా మారనుంది. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయ అధికారులు, చీఫ్ ఇంజనీర్‌తో ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ అంశాలను పరిష్కరించి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాజెక్టులో భాగంగా కొన్ని బీటీ రోడ్డు పునరుద్ధరణ, మరమ్మతు పనులు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి 2027 జూన్ నాటికి ఉప్పల్--నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఉప్పల్--నారపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు నగర తూర్పు వైపు విస్తరిస్తున్న ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ మెరుగుపడే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతుల పరిస్థితి దయనీయం

### మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన

హైదరాబాద్,

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన నీటిని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడు ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందుగానే వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడంలో విఫలమైందని పువ్వాడ మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ నిర్ణయాల వల్లే క్షేత్రస్థాయిలో పంట పొలాలు ఎండిపోయే తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, బాధితుల తరఫున పోరాటాలు చేస్తున్నప్పటికీ పాలకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వెంటనే స్పందించి అధికారులు క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటలను స్వయంగా పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, అరకొర కోతలు లేకుండా ఉచిత విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

### మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు

### తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ

### జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

న్యూఢిల్లీ

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

### కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం

### అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

### ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

### కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

హైదరాబాద్, హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## అనర్హుల ఖాతాల్లో రూ.10 వేలు రిఫండ్

హైదరాబాద్, ‾

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసి.. లిస్ట్‌లో పేరు రాలేదా? అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు.. అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు.. తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు.. సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే.. అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

## అనర్హుల ఖాతాల్లో రూ.10 వేలు రిఫండ్

హైదరాబాద్,

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసి.. లిస్ట్‌లో పేరు రాలేదా? అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు.. అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు.. తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు.. సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే.. అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

## గచ్చిబౌలిలో దారుణ హత్య

హైదరాబాద్,

హైదరాబాద్‌లో దారుణ హత్య వెలుగు చూసింది. రాయదుర్గం పీఎస్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లోని హరిహర మెన్ హాస్టల్‌లో శశిధర్(43) వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలోని శివబాలాజీ హాస్టల్‌లో ప్రమోద్ అనే వ్యక్తి చాఫ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇద్దరి మధ్య ఏదో విషయంపై చిన్న గొడవ జరిగింది. వివాదం తీవ్ర రూపం దాల్చడంతో ప్రమోద్ కత్తితో శశిధర్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన శశిధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లా దుమురియా మండలం సరాధా గ్రామానికి చెందిన శశిధర్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిగా అనుమానిస్తున్న ప్రమోద్ స్వస్థలం బాలేశ్వర్ జిల్లా బెల్గోనియా గ్రామంగా గుర్తించారు. అసలు ఈ హత్యకు కారణం ఏమిటి? శశిధర్, ప్రమోద్ మధ్య గతంలో ఏమైనా గొడవలు ఉన్నాయా? హత్యకు ముందు ఇద్దరి మధ్య ఏం జరిగింది? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

### సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి

### అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

హైదరాబాద్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారిన సూచీలు చివర్లో కొంత కోలుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను కనిష్ఠాల నుంచి కొంత వరకు గట్టెక్కించాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 120.83 పాయింట్లు నష్టపోయి 74,781.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 79.70 పాయింట్లు తగ్గి 23,398.10 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిందాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముందున్నాయి. మరోవైపు పలు కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.26 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.58 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఐటీ సూచీలు మాత్రం లాభాల్లో కొనసాగి ప్రధాన సూచీలకు కొంత అండగా నిలిచాయి.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
మెదక్ - సంగారెడ్డి - సిద్దిపేట

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన....
## - అదనపు కలెక్టర్ నగేష్....

మెదక్, సెప్టెంబర్ 12(అక్షర కలం)



జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ డే కార్యక్రమంలో భాగంగా మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నేడు కుల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామం, పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, ఓటర్ల జాబితా పరిశీలన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న అభ్యంతరాలు, దరఖాస్తులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో మ్యాపింగ్ కాని కేసులు (నో మాపింగ్ కేసెస్ ) ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించి, సంబంధిత రికార్డులను అధికారులు, సిబ్బందితో కలిసి ధృవీకరించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ఓటరు కంపియన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహాయాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌కు అవమానం చేస్తే సహించం....

- దళితుల ఆత్మగౌరవం-రాజ్యాంగ గౌరవం - న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుంది.....
- బిఆర్ఎస్ తీరుపై కొల్చారం కాంగ్రెస్ నేతల మండిపాటు...
- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్....

కొల్చారం, సెప్టెంబర్ 12(అక్షర కలం)

కొల్చారం మండల కేంద్రంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించి సామాజిక నిబద్ధతను చాటుకుందని అన్నారు. అయితే ప్రతిపక్ష బి ఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచితంగా ప్రవర్తించడం దళిత సమాజాన్ని అవమానించడమేనని



మండిపడ్డారు.అసెంబ్లీ నిబంధనలను ఉల్లంఘిస్తూ బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ప్రజలు గమనిస్తున్నారని, దళిత స్పీకర్ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారుల పట్ల ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించడం, సిబ్బందిని నెట్టివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.

### ఘన్‌పూర్ ఆయకట్టుకు నీరందిస్తాం

కొల్చారం, పాపన్నపేట పరిధిలోని ఘన్‌పూర్ ఆనకట్ట (వనదుర్గ ప్రాజెక్టు) కింద ఉన్న ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, పెట్టుబడి సహాయం, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని అన్నారు.

### మండల అభివృద్ధికి ప్రాధాన్యం

కొల్చారం మండలంలోని గ్రామాలకు లింక్ రోడ్లు, తాగునీటి వసతులు కల్పించడంతో పాటు అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# యువతలో తగ్గేదేలే విపరీతంగా పెరుగుతున్న వంగ క్రేజ్

అక్షర కలంసిద్ధిపేటసెప్టెంబర్12:

యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో, ప్రజాసమస్యలపైనిలదీయడంలో ముందుండే యువనేత వంగ రాజేశ్వర్ రెడ్డికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. తాజాగా సిద్ధిపేటలో ఆయనను కలిసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా యువకులు, విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక అంశాలు, భవిష్యత్తు కార్యాచరణపై యువతతో ఆయన ఉత్సాహంగా చర్చించారు. యువతకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్నందుకే తామంతా ఆయన వెంటే నడుస్తామని యువకులు స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో యువత ఒక్కచోట చేరి సంఘీభావం తెలపడంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి....

- మండపాల నిర్వాహకులతో పోలీసుల సమన్వయ సమావేశం....
- మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.....
- డీజేలకు అనుమతి లేదు.. రాత్రి 10 గంటల వరకే స్పీకర్లు....
- సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దు....
- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు....

మెదక్, సెప్టెంబర్ 12(అక్షర కలం)

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మెదక్ టౌన్, మెదక్ రూరల్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటు, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్యం, నిమజ్జనం తదితర అంశాలపై పోలీసు అధికారులు నిర్వాహకులకు పలు సూచనలు





చేశారు.సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రతి గణేష్ మండపాన్ని పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలూ కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు కాల్చరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని, మండపాల వద్ద డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని ఎస్పీ కోరారు. ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా అవసరమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# బెజ్జంకి, కోహెడ మండలంలో జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మిక పర్యటనలు.

అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12 :

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నుండి కిందిస్థాయి సిబ్బంది వరకు సమయ వేళలు పాటిస్తున్నారా అని ఆరా తీశారు. 24/7 ఆసుపత్రి కావున రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి మలేరియా, డెంగ్యూ కేసులు వివరాలను ఏఎన్ఎం, సూపర్ వైజర్లతో ఆరా తీశారు. ప్రతివారం నిర్వహించే శానిటేషన్ డ్రైవ్ లో తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. బెజ్జంకి





మండలంలోని తెలంగాణ మెడల్ స్కూల్- బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయే విధంగా రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టే విధంగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరు ప్రకారమే ప్రతిదీ రాయాలని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ మైంటైన్ చేయడంలో పలు సూచనలు చేశారు. కోహెడ మండలంలో తంగళ్ల పల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ నిర్మాణం కావున మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో యుద్ధ ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్ల మధ్య నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మెడల్ గా నిలుస్తుందని తెలిపారు.

# అభివృద్ధిని అడ్డుకుంటున్నా హరీష్ రావు రాజీనామా చేయాలి

రైతుల ముసుగులో బిఆరెస్ కార్యకర్తల ధర్నాలు సిగ్గుచేటు
టీపీసీసీ కార్యదర్శి ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి

అక్షర కలంసిద్దిపేటసెప్టెంబర్ 12:

అభివృద్ధిని అడ్డుకుంటున్నా హరీష్ రావు రాజీనామా చేయాలని టీపీసీసీ కార్యదర్శి నంగునూర్ మండల ఏఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరిడిమాండ్ చేశారు.శనివారం



నంగునూర్ మార్కెట్ కార్యాలయం లో విలేకరుల తో మాట్లాడారు.ఓట్లేసిన ప్రజల సమస్యలు పట్టించు కోకుండాప్రతిపక్షం ముసుగులో మాజీ మంత్రి హరీష్ రావు సిద్దిపేట నియోజకవర్గం లో అభివృద్ధిని అడ్డుకుంటున్నాడనివిమర్శించారు.ఘతం లో అసంపూర్తి పనులు ఎన్నోఉన్నాయి.వాటిని పూర్తి చేయవలసిన భాద్యత కూడా ఎమ్మెల్యే గా తన మీద ఉన్నపటికీ పట్టించుకోండా ప్రతిరోజు ప్రభుత్వం పైన ముఖ్య మంత్రి పైన అర్థం,పర్థం లేనిపనికిమాలిన చౌకభారు విమర్శలు చేస్తూ విలువైన సమయం హృదచేయడం ఎందుకని ప్రశ్నించారు.ప్రతి పక్షం అంటే ప్రతి రోజు అసత్య ఆరోపణలుతో చేయడమేనా అని నిలదీశారు.రాష్ట్రము లో వ్యవసాయానికి రైతులకు సరిపడా విధ్యుత్ ఇస్తుంటే, కోతలు విధిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ రైతులకు ముసుగులో బిఆరెస్ నాయకులతో, కార్యకర్తలతో హరీష్ రావు ధర్నలు చేయించడం సిగ్గుచేటన్నారు.ఎక్కడ లేనిది కరంట్ కోతలు ఒక్క సిద్దిపేట నియోజకవర్గం లోనే ఉత్పన్నామావడం విడ్డురంగా ఉందన్నారు.రాజకీయంగా వ్యక్తిగత అభివృద్ధి కోసం, మాట్లాడుతూ అభివృద్ధి పైన, ప్రజల సమస్యల పైన మాట్లాడని హరీష్ రావు ఎమ్మెల్యే గా పనికి రావు తక్షణమే రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అచ్చిన సత్తయ్య,బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్,కాంగ్రెస్ మండల నాయకులు దాసరి కిషన్, కందికట్ల రాజు పాల్గొన్నారు.

# జోగిపేట కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్

356 కేసుల పరిష్కారం
జూనియర్ సివిల్ జడ్జి శ్రీ మహమ్మద్ అసదుల్లా షరీఫ్

అక్షర కలం, అందోలు ప్రతినిధి:,

సంగారెడ్డి జిల్లా అందోలు మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో జోగిపేట పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల న్యాయసేవా కమిటీ చైర్మన్, కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అధ్యక్షతన వహించి పర్యవేక్షించారు. లోక్ అదాలత్ బెంచ్ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డిలు వ్యవహరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వలన కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని, ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఇందులో వివిధ బ్యాంకుల రికవరీ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలను పరస్పర అంగీకారంతో సమగ్రంగా మొత్తం 356 కేసులను పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సర్కిల్ సీఐ అనిల్ కుమార్, జోగిపేట, పుల్కల్, వట్పల్లి ఎస్ఐలతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు. సంబంధిత అధికారుల సమన్వయంతో ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది.



# రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన బాధితురాలు..

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

సంగారెడ్డి పట్టణం వార్డు నెం.30, బాలాజీ నగర్ కాలనీకి చెందిన ఎం.వరలక్ష్మి అనే మహిళకు ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ సి,ఇందిరమ్మ ఇంటి పట్టా స్థలానికి వెళ్లే లేఅవుట్ రోడ్డును కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి రోడ్డుకు అడ్డంగా ఇళ్లు కడుతున్నారని మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. సుమారు 68 గజాల మేర రోడ్డును ఆక్రమించడం వల్ల తన ఇంటికి రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయని తన దుకాణానికి కూడా దారి లేకుండా పోయిందని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. వెంటనే విచారణ జరిపి ఆక్రమణలు తొలగించి, రోడ్డును పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ ఫిర్యాదు కాపీలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైదరాబాద్ కమిషనర్, నేషనల్ ఎస్ సి కమిషన్ హైదరాబాద్,మరియు తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా పంపామని తెలిపారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955

# డీజేలకు అనుమతులు ఇవ్వొద్దు

## శబ్ద కాలుష్యాన్ని నివారించాలి

## మధిర టౌన్ సీఐ డీవైఎఫ్ఐ వినతి

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

మధిర, రాబోయే వినాయక చవితి సందర్భంగా డీజే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకుండా, అధిక శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు మధు కోరారు. ఈరోజు ఉదయం మధిర టౌన్ లోనే బోడెపూడి భవన్ లో జరిగిన టౌన్ డివైఎఫ్ఐ కమిటీ సమావేశం కి ముఖ్యఅతిథిగా హాజరైన బొడ్డు మధు యువతలో గంజాయి డ్రగ్స్ మద్యాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాబోయే వినాయక చవితి సందర్భంగా డీజే లకు అధిక సౌండ్ పొల్యూషన్ కు నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారుఈ మేరకు శనివారం మధిర టౌన్ సీఐ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు మధు మాట్లాడుతూ.. డీజేలు, అధిక శబ్దాలతో నిర్వహించే



కార్యక్రమాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా యువతపై డీజే సంస్కృతి ప్రతికూల ప్రభావం చూపుతోందని, కొందరు యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల ప్రభావంతో గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉందన్నారు. అధిక శబ్ద కాలుష్యం వల్ల మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారిపై అధిక శబ్దం మరింత ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని డీజే కార్యక్రమాలపై నియంత్రణ విధించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకూడదని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐకి విజ్ఞప్తి చేశారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంతోపాటు, అధిక శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు పోలీసులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బొడ్డు మధు కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్రనపు మధు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సైదులు టౌన్ నాయకులు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు...

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయండి -- --- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య.

**అక్షరకలం ఇల్లందు ప్రతినిధి :-**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం సి పిఐ కార్యాలయంలోజరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సారయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం (1946–1951) వారోత్సవాలను ఈ నెల సెప్టెంబర్ 11 నుండి 17 వరకు ఘనంగా నిర్వహించాలని అన్నారు. "నిజాం నిరంకుశ పాలనకు, దొరల వెట్టిచాకిరీకి, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, కార్మికులు, మహిళలు




ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహోజ్వల చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటనిదని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి విముక్తి కోసం జరిగిన ఈ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోరాట ఫలితంగానే నేడు పేదలకు భూములు దక్కాయని, ఈ వారోత్సవాలలో భాగంగా ఇల్లందు ఏరియా వ్యాప్తంగా ఉన్న అన్ని గనుల వద్ద, కార్మిక కాలనీలలో పట్టణ మండలం లో ఎర్ర జెండా ఆవిష్కరణ,అమరవీరులకు నివాళులు, సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్మికులు, రైతులు, ప్రజాతంత్రవాదులు అధిక సంఖ్యలో పాల్గొని వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బొప్పిశెట్టి సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, కొరిమి సుందర్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగులోత్ కృష్ణ, ఉప సర్పంచ్ షేక్ ఖాసీం, బాషపాక రవి, నెల్లి కొమరయ్య, షేక్ వలి, జంగంపల్లి మోజేస్, భాస్కర్, ఉడుత ఐలయ్య, బంటు యాదగిరి, ఆలేం రాఘవేంద్రరావు, ఆకుల చందర్ రావు, నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాలొత్ హరిసింగ్, వి జయరాజు, దాట్ల వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## "ఎర్రబోడు కోయగుంపులో" సీతారాం ఏచూరి రెండో వర్ధంతి

**అక్షర కలం/ సింగరేణి :**



సింగరేణి: మండలం ఎర్రబోడు, కోయ గుంపులో,సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

ఈ కార్యక్రమంలో సింగరేణి సిపిఎం మండల ఆర్గనైజర్ వజ్జా రామారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలే ఆయన ఊపిరి మతం, కులం, పేరిట జరిగే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య విలువల రక్షణ కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో పండగ కొండయ్య, కురసం శ్రీను,పూణ్యం బాబు, అయినాల వెంకటేశ్వర్లు ,కరపటి సీతారాములు, కే నరసింహారావు, కరపటి లక్ష్మయ్య,సరోజనమ్మ, గ్రామ పెద్దలు నర్సింగ్ మాధవరావు నర్సింగ్ అనంతరామయ్య నర్సింగు రాణమ్మ తదితరులు పాల్గొని ఆ మహానేతకు నివాళులర్పించారు

## ఎన్ ఎస్ యు ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భల్లెం చంటి నియామకం

**అక్షర కలం/ మహబూబాబాద్:**

నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ( ఎన్ ఎస్ యు ఐ ) లిమహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భల్లెం చంటి నియమితులయ్యారు. ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు శ్రీ వినోద్ జాఖర్ జీ ఆదేశాల మేరకు, ఎన్ ఎస్ యు ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యాదవల్లి వెంకటస్వామి మార్గదర్శకత్వంలో భల్లెం చంటిని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.




ఈ నియామకానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ఎమ్మెల్సీ ఏ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అన్న గారు, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్ మహబూబాబాద్ డిసిసి అధ్యక్షులు శ్రీ భూక్య ఉమా మురళీ నాయక్ ఎన్ ఎస్ యు ఐ మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు పెరుమాండ్ల చరణ్ గౌడ్ , మొదలగు నేతల సహకారం, మద్దతు, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని ఎన్ ఎస్ యు ఐ నాయకులు తెలిపారు. విద్యార్థుల సమస్యలే ప్రాధాన్యతగా... జిల్లాలో విద్యార్థుల సమస్యలను బలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, విద్యార్థులకు న్యాయం జరిగేలా నిరంతరం పోరాటం చేయడం, విద్యా రంగంలో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని భల్లెం చంటి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో . ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేస్తూ, ప్రతి కళాశాలలో విద్యార్థుల గొంతుకగా నిలిచి, విద్యార్థి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భల్లెం చంటికి ఎన్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## రాజీ మార్గమే రాజ మార్గం.. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు

### జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని




మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ఠ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో ఘనంగా గణేష్ చతుర్థి వేడుకలు.



**అక్షరకలం ఇల్లందు ప్రతినిధి :-**

ఖమ్మం పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో గణేష్ చతుర్థి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణహిత గణపతి విగ్రహాలను తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మట్టి, సహజసిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన ఎకో-ఫ్రెండ్లీ గణపతి విగ్రహాల ద్వారా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు రసాయన రంగుల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై విద్యార్థులు సందేశాన్ని అందించారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, మన సంప్రదాయాలను పాటిస్తూనే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, కోఆర్డినేటర్లు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కల్యాణి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలపై వేధింపులకు అడ్డుకట్ట వేయాలి. .. మహిళా రక్షణ సంఘం.



**అక్షర కలం / భద్రాచలం**

చర్ల మండల కేంద్రంలోని శ్రీ స్వప్న వారాహి అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో మహిళా రక్షణ సంఘం చర్ల మండల సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భద్రాచలం మహిళా రక్షణ సంఘం డివిజన్ అధ్యక్షురాలు సిహెచ్. సుజాత పాల్గొని మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. చర్ల మండలంలోని మహిళలు, బాలికల భద్రతకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు, అసభ్య ప్రవర్తన, గృహహింస వంటి ఘటనలను అరికట్టడంతో పాటు, బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేసే విధంగా వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని అన్నారు. ముఖ్యంగా ఆలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఉండటం వల్ల మహిళలు, బాలికలు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, అలాంటి ప్రాంతాల్లోని మద్యం దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులు, విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణంలో రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చర్ల మండలంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, మార్కెట్ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని పెంచాలని, అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలు, బాలికలకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. మహిళల భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను ముందుగానే గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆలయాలు,విద్యాసంస్థల పరిసరాలను మద్యం దుకాణాలకు దూరంగా ఉంచాలని మహిళా రక్షణ సంఘం డిమాండ్ చేసింది.

## వినాయక చవితి పండుగ సందర్భంగా ఐటీడీఏ మరియు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గిరిజన దర్బార్ రద్దు

**ఐటిడిఏ పిఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట,**

**అక్షర కలం / భద్రాచలం**

తేదీ 14 సెప్టెంబర్ 26 సోమవారం నాడు భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో జరిగే గిరిజన దర్బార్ కార్యక్రమం వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున రద్దు చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున ఐటీడీఏ యూనిట్ అధికారులు అందుబాటులో ఉండని కారణంగా గిరిజన దర్బార్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని, ఆదివాసి గిరిజనులు ఎవరు దరఖాస్తులు సమర్పించడానికి ఐటీడీఏ కార్యాలయంకు రాకూడదని ఆయన అన్నారు మరియు సబ్ కలెక్టర్ కార్యాలయం లో తేదీ 14 సెప్టెంబర్ 26 సోమవారం నాడు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమం వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున రద్దు చేయడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున రెవెన్యూ డివిజన్ అధికారులు ఎవరు అందుబాటులో ఉండని కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని, డివిజన్ ప్రజలు ఎవరు దరఖాస్తులు సమర్పించడానికి సబ్ కలెక్టర్ కార్యాలయంకు రాకూడదని ఆయన అన్నారు






# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి: - మరికల్ సీఐ భగవంత్ రెడ్డి

**...డిజె లకు అనుమతి లేదు, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.**

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ × ఆదేశాల మేరకు**



గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, ధన్వాడ ఎస్సై మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు, గణేష్ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని కోరారు. గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు పోలీస్ శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోలీస్ పోర్టల్‌లో మండపాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. మండపాల వివరాలు ముందస్తుగా పోలీసులకు అందించడం ద్వారా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మండపాల వద్ద భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, విద్యుత్ సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు 24 గంటలూ కనీసం ఇద్దరు బాధ్యత వహించేలా ఉండాలని తెలిపారు. గణేష్ విగ్రహాలను దర్శించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, మండపాల వద్ద రద్దీ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ పరస్పర సహకారం, సమన్వయంతో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ భగవంత్ రెడ్డి కోరారు. పండుగల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ధన్వాడ ఎస్సై మహేశ్వరి, గణేష్ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, సర్పంచులు, గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణే లక్ష్యం

**తెలంగాణ రక్షణ సేనలోకి అయిజ ఏబీవీపీ ముఖ్య నాయకులు**

**కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మండలానికి చెందిన ఏబీవీపీ ముఖ్య నాయకులు తెలంగాణ రక్షణ సేన--టీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు. అయిజకు చెందిన వెంకటేష్, అభినయ్, జశ్వంత్, వేణుగౌడ్, వినయ్ కుమార్, శేఖర్ తదితరులకు కవిత పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ గద్వాల నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ సీనియర్ నాయకులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి పురస్కారం అందుకున్న కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్

**ప్రజాసేవ, పద్మశాలి సమాజ అభివృద్ధికి విశిష్ట సేవలకు గుర్తింపు**



**గద్వాల టౌన్ అక్షరకలం:**

సెప్టెంబర్ 12: హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ ప్రతిష్ఠాత్మక పద్మశాలి పురస్కారం అందుకున్నారు. పద్మశాలి ప్రజాప్రతినిధులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి అధ్యక్షులు కందగట్ల స్వామి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాసులు, గుండు సుధారాణి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి అధ్యక్షులు కామర్తి మురళి తదితరుల చేతుల మీదుగా పులిపాటి వెంకటేష్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ.. తనకు అందించిన ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. పద్మశాలి సమాజ అభివృద్ధితో పాటు ప్రజా సేవలో తన వంతు కృషిని మరింత ఉత్సాహంతో కొనసాగిస్తానని పేర్కొన్నారు. పులిపాటి వెంకటేష్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడంపై పలువురు పద్మశాలి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

**- ఈ నెల 15లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి:**

**- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**( అక్షర కలం, నారాయణపేట, సెప్టెంబర్,12)**

.నారాయణపేట జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు ఫ్రైజూ:7/స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాథ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని



పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు..

## నారాయణపేట అగ్నిమాపక అధికారి.( డి ఎఫ్ ఓ) ఖర్దుంగ్ లా పర్వతాల్లో పరుగుల విజేత!

**(అక్షర కలం, నారాయణపేట, సెప్టెంబర్,12)**

17,965 అడుగుల ఎత్తులో 13 గంటల్లో 72 కి.మీ. ఖర్దుంగ్ లా ఛాలెంజ్ పూర్తి చేసిన జీవీ ప్రసాద్‌నారాయణపేట జిల్లా అగ్నిమాపక కేంద్రంలో ఐఖీూ గా విధులు నిర్వర్తిస్తూ.. పరుగుల ప్రపంచంలో సరికొత్త రికార్డులను సొంతం చేసుకుంటున్నారు జీవీ ప్రసాద్. ప్రజల ప్రాణాలను రక్షించే బాధ్యతలో నిరంతరం అప్రమత్తంగా ఉండే ఆయన.. తాజాగా లడాఖ్‌లో సముద్ర మట్టానికి 17,965 అడుగుల (5,476 మీటర్లు) ఎత్తులో ఉన్న ఖర్దుంగ్ లా పర్వత ప్రాంతంలో నిర్వహించిన 72 కిలోమీటర్ల ఖర్దుంగ్ లా ఛాలెంజ్--2026ను 13 గంటల్లో విజయవంతంగా పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో నిర్వహించే కఠినమైన పరుగుల్లో ఖర్దుంగ్ లా ఛాలెంజ్ ఒకటి. తక్కువ ఆక్సిజన్, చలి వాతావరణం, కఠినమైన పర్వత మార్గాలు రన్నర్ల సామర్థ్యానికి పెద్ద సవాల్‌గా నిలుస్తాయి. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ ప్రసాద్ ఈ సవాల్‌ను పూర్తి చేశారు.

లడాఖ్ మారథాన్‌తో అర్హత

ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌కు ముందు జీవీ ప్రసాద్ లడాఖ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సముద్ర మట్టానికి సుమారు 11,500 అడుగుల ఎత్తులో ఉన్న లడాఖ్‌లో 42.20 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేయడం ద్వారా ఖర్దుంగ్ లా ఛాలెంజ్‌లో పాల్గొనే అర్హత సాధించారు.

'ప్రోకామ్ స్లామ్'లోనూ ఘనత

2024--25లో ప్రోకామ్ స్లామ్‌లో భాగంగా బెంగళూరులో 10 కి.మీ., ఢిల్లీలో 25 కి.మీ., కోల్‌కతాలో 25 కి.మీ., ముంబైలో 42.20 కి.మీ. రేసులను విజయవంతంగా పూర్తి చేశారు. వివిధ రేసుల్లో ఇప్పటివరకు 50 పతకాలు సాధించారు.



డీజీ అభినందనలు

ఈ అరుదైన విజయంపై తెలంగాణ అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్, ఐపీఎస్ గారు అభినందనలు తెలిపారు.

## మరికల్‌లో స్పెషల్ క్యాంపెయిన్ డే: - ఓటరు నమోదు, సవరణలపై అవగాహన :

**(అక్షర కలం, నారాయణపేట, సెప్టెంబర్ 12:)**

మరికల్ మండలం మరికల్ గ్రామంలోని 242, 243, 246, 247 మరియు 249 పోలింగ్ స్టేషన్ల పరిధిలో శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, గ్రామ సర్పంచ్, డిప్యూటీ సర్పంచ్,



బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓలు) మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఫారం--6, ఫారం--7, ఫారం--8లకు సంబంధించిన వివరాలను అందించారు. ఫారం--6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం--7 ద్వారా ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు, ఫారం--8 ద్వారా ఓటరు వివరాల్లో మార్పులు/సవరణలు చేసుకునే విధానంపై అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు ఉంటే సంబంధిత బి ఎల్ ఓ లను సంప్రదించి సరిచేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## ఎస్ఎస్సీ టాపర్లు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎస్సీ స్కూల్ టాపర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శాలువా, పూలగుచ్ఛం, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల



బాధ్యతను నేర్పుతున్నారని పేర్కొన్నారు. ఎస్ఎస్సీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయం వారి కష్టపడి చదివిన ఫలితమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహానికి నిదర్శనమని అన్నారు. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధిలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందేలా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల విజయలక్ష్మి, నర్సింహులు, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మోసిన్, వంట భాస్కర్, మాకం బీచుపల్లి, బాబు నాయుడు, వివిధ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు పోరాటాలు చేద్దాం.ఘనంగా సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి.

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



సిపిఐ ఎం పార్టీ మాజీ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......సీతారాం ఏచూరి ఉన్నత చదువులు చదువుకుని పేద ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేశారని, విద్యార్థి దశ నుండే పోరాటాల వైపు ఆకర్షితుడై విద్యార్థుల సమస్యలపై గళమెత్తారని, విద్యార్థి నాయకుడి నుండి సిపిఐ ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారని అన్నారు. పార్లమెంటు, రాజ్యసభలో దేశంలోని అనేక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజల తరపున పోరాడారని గుర్తు చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలి రాజకీయ స్వలాభం కోసం పనిచేస్తున్నాయని ఒకవైపు కుల మత రాజకీయాలతో ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టిస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో రైతాంగం పూర్తిగా అప్పుల పాలు అవుతోందని కరెంటు సక్రమంగా అందక వేసిన పంటలు కూడా ఎండుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు.

## లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ తప్పనిసరి

**ఏరియా డిజిఎం**

**పర్సనల్ సీహెచ్ అశోక్**

**మందమర్రి, సెప్టెంబర్ 12 అక్షర కలం:**

సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ (సిపిఆర్ఎంఎస్ - ఎన్ఇ) ద్వారా వైద్య సేవలను నిరంతరాయంగా పొందేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో అన్ లైన్ లో లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవడం తప్పనిసరి అని సింగరేణి ఏరియా డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ?గత నవంబర్ నెలలో ఆన్ లైన్ లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడం వల్ల ఏరియాకు చెందిన 1057 మంది విశ్రాంత ఉద్యోగులు ప్రస్తుతం వైద్య సేవలు పొందలేకపోతున్నారని వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించిందీ, లేనిదీ వెంటనే సరిచూసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు నమోదు చేసుకోనివారు, సాంకేతిక పొరపాట్ల వల్ల పూర్తికాని వారు ఎవరైనా ఉంటే, తక్షణమే ఆన్ లైన్ లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి, తిరిగి వైద్య సేవలను పునరుద్ధరించుకోవచ్చునని స్పష్టం చేశారు. సిపిఆర్ఎంఎస్ - ఎన్ఇ ద్వారా వైద్య సహాయం పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# అందరి కోసం.. ఓ యంగ్ సైంటిస్ట్!

ఉస్మానియా క్యాంపస్ నుంచి ఆడియాలజీలో పీజీ చేసిందో అమ్మాయి.గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో రీసెర్చ్ చేసే అవకాశమూ దక్కించుకుంది. ఆ అనుభవాన్ని నిరుపేదలసేవకు ఉపయోగిస్తున్నది. అంతేకాదు, డిస్‌ఫేజియా అనే వ్యాధి మీద పరిశోధనచేస్తూనే.. హైదరాబాద్‌లోనివైద్య విద్యార్థులకు తాను తెలుసుకున్న విషయాలను బోధిస్తున్నది. ఆ సేవలకు గానుఇటీవల ఢిల్లీ ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా యంగ్ సైంటిస్ట్ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ కర్పూరం గోవతి నిఖిల తన ప్రయాణాన్ని 'జిందగీ'తో పంచుకున్నదిలాఆడపిల్లలను గౌరవంగా చూసే వృత్తిలోనే స్థిరపడాలని చిన్నప్పటి నుంచీ ఉండేది. అంతటి గౌరవం వైద్యులకే దక్కుతుంది. డాక్టరు కనిపిస్తే జనం చేతులెత్తి మొక్కుతారు. మా తాతయ్య కూడా 'నువ్వు డాక్టర్




కావాలి. నేను నీకు తలుపు తీయాలి%ా%' అని




ఎప్పుడూ చెప్పేవారు. డాక్టర్ అయితే లేనివాళ్లకు సాయపడవచ్చనీ అనేవారు. అలా నా మనసులో వైద్యవృత్తి మీద గొప్ప భావన ఏర్పడింది. అయితే, ఎంబీబీఎస్ చదవడం కష్టమని నా తల్లిదండ్రుల అభిప్రాయం. నాకేమో మెడికల్ ఫీల్డ్‌కు రావాలని కోరిక. అందుకే, ఎలాగోలా ఇంట్లో వాళ్లను ఒప్పించి ఉస్మానియా యూనివర్సిటీలో ఆడియాలజీ కోర్సులో చేరాను.

అక్కడే పీజీ కూడా పూర్తి చేశాను. వెంటనే, మేదాంత హాస్పిటల్స్ నుంచి ఫోన్ వచ్చింది. మన దేశంలో ఎయిమ్స్ తర్వాత అంతపెద్ద దవాఖాన అదే. ఉద్యోగమే కాదు, రీసెర్చ్ చేసేందుకు కూడా ఎన్నో అవకాశాలు ఉంటాయి. కానీ అది ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో ఉంది. అంత దూరమంటే ఇంట్లో ఒప్పుకోరని భయం. అందుకే, ఢిల్లీ చూద్దామన్నట్టు అమ్మమ్మను తీసుకొని వెళ్లాను. అక్కడికి వెళ్లాక ఆ వాతావరణం నాకెంతో నచ్చింది. దాంతో, అమ్మానాన్నలను ఒప్పించి చేరిపోయాను.

## ఆరువేల మందికి సేవ..

మేదాంత నా కెరీర్‌ను మలుపు తిప్పింది. రకరకాల సమస్యలతో పేషెంట్లు వచ్చేవారు. ముక్కులో నుంచి ఆహార పైపులు వేసుకున్న వాళ్లూ కనిపించేవారు. వాళ్లలో చాలామంది డిస్‌ఫేజియా అనే సమస్యతో బాధపడుతున్నారని అక్కడికి వెళ్లాకే తెలిసింది. డిస్‌ఫేజియా అంటే మింగడంలో ఇబ్బంది. నరాల సమస్యలు ఉన్నవాళ్లు, హృద్రోగులు, క్యాన్సర్ పేషెంట్లుఇలా చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొంటారు. ఇలాంటి ఇబ్బందినే తన చివరి దశలో తాతయ్య కూడా అను భవించారు. పక్షవాతం వచ్చాక ఆహారాన్ని మింగలేకపోయేవారు. ఇలాగే పైపు వేయాల్సి వచ్చింది. మేదాంతలోనూ అలాంటి వాళ్లు కనిపించేసరికి సమస్య మూలాలు తెలుసుకోవాలనే ఆత్రుత పెరిగింది. సంబంధిత కోర్సు చేశాను. తాతయ్యలాంటి చాలా మందికి సేవ చేసే అవకాశం వచ్చింది.

ఆ బాధ్యతలకు న్యాయం చేస్తూనే.. డిస్‌ఫేజియాకు సంబంధించి 35 దాకా పరిశోధన పత్రాలు సమర్పించాను. అవన్నీ వివిధ వైద్య పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ రీసెర్చ్ చేసే క్రమంలో పరిచయాలూ పెరిగాయి. వాటిని సమర్థంగా ఉపయోగించుకుని నలుగురికీ సాయం చేయాలనే ఆశయంతో గోవతి హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. కొవిడ్ సమయంలో ఎన్నో ఆసుపత్రులకు ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్లు అందించాను. నాన్న సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో రేషన్ డీలర్ కావడంతో, ఆ సర్కిల్ మొత్తంలోని డీలర్లకు కొవిడ్ కిట్స్ అందించాను. మిత్రుల సాయంతో వంద దాకా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించాను. గుండె, మోకాళ్ల చికిత్సలకు, ప్లాస్టిక్ సర్జరీలకు సాయం చేశాను. మా నాన్న దగ్గరికి వచ్చేవాళ్లంతా పేదలు కాబట్టి, వాళ్ల అవసరాలను బట్టి రకరకాల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తాను. మొత్తంగా నా ఫౌండేషన్ ద్వారా ఇప్పటికి ఆరువేల మందికి పైగా సేవలందించాను.

## అదే నా ఆశ

సెలవులకు ఇంటికొచ్చిన ప్రతిసారీ నేను మేదాంతలో నేర్చుకున్న వివిధ అంశాలను హైదరాబాద్‌లోని మెడికల్ స్టూడెంట్స్‌కు బోధిస్తుంటాను. ఉస్మానియా కాలేజీ, హెలెన్ కెల్లర్, స్వీకార్ ఉపకార్, ఏవైజేఎన్‌ఐహెచ్‌హెచ్‌లాంటి ఇన్‌స్టిట్యూట్స్ ఇందులో ఉన్నాయి. డిస్‌ఫేజియా చికిత్సలో ఏ వైపు నుంచి ఏ అవసరం ఉన్నా ఫోన్‌లో అందుబాటులో ఉంటాను. నాదైన రంగంలో ప్రతిభ కనబరిచినందుకు యంగెస్ట్ రీసెర్చర్ ఇన్ డిస్‌ఫేజియాగా ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నాకు చోటు దక్కింది. ఢిల్లీకి చెందిన ఎన్జీవోలు ఇచ్చే భారత గౌరవ రత్న అవార్డు, యంగ్ సైంటిస్ట్ అవార్డు సహా చాలా పురస్కారాలు అందుకున్నాను. మన రాష్ట్రంలో డిస్‌ఫేజియాకు సంబంధించి ఒక ప్రభుత్వ విభాగం పెడితే.. దాని ద్వారా రోగులకు సేవలందించాలని నా ఆశ. దానివల్ల మరింత మందికి నా పరిశోధన ఫలితాలు అందుతాయి. అదే కనుక సాధ్య మైతే, నాకు దక్కిన అతి పెద్ద పురస్కారంగా దాన్ని భావిస్తాను. అంతకు మించిన ఆత్మసంతృప్తి ఉండదు.

# నీటిలో చేపలా ఈదుతూ అక్కడి అందాలను బంధించే డ్రోన్‌లూ వచ్చేస్తున్నాయ్!

## ట్రూక్ క్లారిటీ

హెడ్‌ఫోన్లు పెట్టుకుని పాటలు విన్నా, కాల్స్ మాట్లాడినా మనకు కావలసింది శబ్దంలో స్పష్టత. అది ఎంత బాగా ఉంటే మనం అంత హాయిగా ఎంజాయ్ చేయగలం. ఎలక్ట్రానిక్ సంస్థ ట్రూక్, 'క్లారిటీ 5' పేరుతో ఇటీవల ఒక హెడ్‌సెట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. మన మాటలు అత్యంత స్పష్టంగా వినిపించడం ఇందులోని ప్రత్యేకత. వీటిలో ఉండే సిక్స్ మైక్స్ ఎన్విరాన్‌మెంటల్ నాయిస్ కాన్సిలేషన్ టెక్నాలజీ చుట్టుపక్కల ఉన్న శబ్దాలు వినిపించకుండా మన మాట మాత్రమే వినిపించేలా చేస్తుంది. అవతలి గొంతునూ స్పష్టంగా వినగలిగేలా పని చేస్తుంది. దీనిలోని బ్లూటూత్ సాయంతో ఫోన్‌తో పాటు ట్యాబ్ లేదా కంప్యూటర్‌కు కూడా ఒకేసారి కనెక్ట్ అవ్వచ్చు. అంటే మనం ల్యాప్‌టాప్‌లో సినిమా చూస్తున్నాం. మరోవైపు కాల్ వచ్చింది. వెంటనే సినిమా ఆపి కాల్ మాట్లాడొచ్చన్నమాట. ఒకసారి చార్జింగ్ పెడితే పది గంటల పాటు పనిచేస్తుంది. ధర 1,499 రూపాయలు.



## షేర్వాణీ కొత్తగా

పండగలూ, ప్రత్యేక సందర్భాల కోసం ఆడపిల్లలకు బోలెడు డ్రెస్సులుంటాయి. లాంగ్ గౌన్లు గాగ్రాల నుంచి లంగావోణీ చీరల దాకా సందడి చేసే దుస్తులెన్నో వరసకడతాయి. కానీ కాస్త పెద్ద వేడుకకు కొత్తగా వేసుకోవాలంటే అబ్బాయిలకు అసలైన ఆప్షన్ షేర్వాణీ ఒక్కటే. దానికి కాస్త వెరైటీ జోడిస్తే ఎప్పుడూ వేసుకునే డ్రెస్సే కదా అనిపించదు. అందుకే జేడ్ బై ఎంకే సంస్థ 'ఆయాజ్ కోట్' పేరిట టూ పీస్ షేర్వాణీని రూపొందించింది. కుర్తీపై కోటు ఉన్నట్టుగా విభిన్నంగా కనిపించే దీనికి అడుగున కోటుకన్నా భిన్నమైన అస్తరును వేశారు. లోపలి, బయటి చొక్కాలకు ప్రత్యేకంగా కనిపించేలా పైపింగ్ చేశారు. దీనికి తెలుపు రంగు స్లిమ్‌ఫిట్ ప్యాంటు జోడించారు. మొత్తంగా చూడగానే ఫ్యాషనబుల్‌గా, విభిన్నంగా కనిపించే ఈ షేర్వాణీ సెట్ ధర రూ.96,400. ద్వారా కొనుగోలు చేయొచ్చు.

## డ్రోన్.. నీళ్ల అడుగున!

పక్షిలా గాలిలో విహరిస్తూ ఫొటోలూ, వీడియోలూ తీసే డ్రోన్‌లనే మనం చూశాం. కానీ నీటిలో చేపలా ఈదుతూ అక్కడి అందాలను బంధించే డ్రోన్‌లూ ఇప్పుడు వస్తున్నాయి. 'ఓషన్‌ఐ' పేరుతో యు కేన్ రోబోటిక్స్ సంస్థ రూపొందించిన డ్రోన్ అలాంటిదే. మహా సముద్రపు నీటి ఒత్తిడిని సైతం తట్టుకునే దీనికి 4కె రిజల్యూషన్ కెమెరాతో పాటు, హై, లో బీమ్‌ల ఎల్ఈడీ లైట్లు ఉంటాయి. దీనివల్ల సముద్రపులో లోతుల్లోమసకగా ఉండే చోట్లా వీడియోలు, ఫొటోలు తీయగలదు. 100 మీటర్ల లోతు వరకూ వెళ్లి, డైవర్లు కూడా చేరుకోలేని ప్రాంతాలను చూపించగలదు. 360 డిగ్రీల కోణంలో ఎటు కావాలంటే అటు తిరుగుతుంది. జాయ్ స్టిక్‌లాంటి రిమోట్ సాయంతో నియంత్రించవచ్చు. ఆ దృశ్యాలన్నీ ఫోన్ ద్వారా చూడొచ్చు. ఒకసారి చార్జింగ్ పెడితే అరగంట పాటు పనిచేస్తుంది. ఇందులో 64 జీబీ మెమరీ ఉంటుంది. దీనికి ఉండే చిన్ని చేతుల్లాంటి అమరిక సాయంతో చిన్నా చితకా వస్తువులను, లేదా అక్కడి నీళ్లను పైకి తీసుకురాగలిగే అవకాశం ఉంది. ధర రూ.4.6 లక్షలు. %ఎశీబఝఅతీశీఎశీఅఎం.ఎశీఎ% ద్వారా ఖరీదు చేయవచ్చు.






## లూయిూ విటోన్ నగ

ప్రముఖ ఫ్రెంచి లగ్జరీ ఫ్యాషన్ సంస్థ లూయిూ విటోన్ తనదైన శైలిలో నగలనూ తయారు చేస్తున్నది. ఇటీవల ఈ బ్రాండ్ నుంచి 'గ్రేస్' పేరిట విభిన్నమైన డిజైన్‌తో ఒక వజ్రాల నెక్లెస్ మార్కెట్లోకి వచ్చింది. బుగాటీ కట్‌గా పిలిచే ఒక ప్రత్యేకమైన కటింగ్ పద్ధతిని దీనిలోని వజ్రాలను మలిచేందుకు వాడారు. గ్రీకు కథల్లో కనిపించే ఫొనిక్స్ పక్షిని పోలిన ఆకృతిలో ఈ నెక్లెస్‌ను రూపొందించారు. మెడలో అందంగా అమరేలా, రెండు 'వి' అక్షరాల కలయికగా దీన్ని డిజైన్ చేశారు. గొలుసులోని డిటాచబుల్ పెండెంట్ తయారీకి తూర్పు ఆఫ్రికా గనుల్లో లభ్యమైన 65 క్యారెట్ల పచ్చను ఉపయోగించారు. అపార నైపుణ్యం కలిగిన శ్రామికులు రెండువేల గంటల పాటు కష్టపడితేనే ఈ గొలుసు తయారవుతుంది. మరిన్ని వివరాలకు లో వెళ్లాలి.






# పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి.. ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, సెప్టెంబర్ 12 అక్షర కలం:**

ప్రతి ఒక్కరు పర్యావరణ హితుగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సింగరేణి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సిఈఆర్ క్లబ్ లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) తో తయారు





చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు తీవ్రంగా కాలుష్యం చెంది, జలచరాలు నశిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చారు. కాలుష్య నివారణే ధ్యేయంగా ఏరియాలో సింగరేణి యాజమాన్యం వేలాది మొక్కలను నాటిందని, ఆనాడు నాటిన చిన్న మొక్కలే నేడు మహావృక్షాలుగా మారి పట్టణానికి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. విఘ్నేశ్వర పూజ అంటేనే ప్రకృతి ఆరాధన అని, గణపతి ఆగమనం నుండి నిమజ్జనం వరకు ప్రతి ఘట్టం ప్రకృతితోనే ముడిపడి ఉందన్నారు. వినాయకునికి సమర్పించే 21 రకాల పత్రి కేవలం పూజాద్రవ్యాలు మాత్రమే కాకుండా మానవాళికి ఆరోగ్యాన్ని ఇచ్చే దివ్యమైన మూలికలని తెలిపారు. ప్రకృతి సమానత్వాన్ని, పర్యావరణ పరిరక్షణ చాటి చెప్పే వినాయక చవితి పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకుని, విఘ్నేశ్వరుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం జివెల్ ప్రసాద్, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి కౌన్సిల్ సభ్యుడు ఈ రాజేశ్వరరావు, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, సీనియర్ పీఓ సత్యనారాయణ, అధికారులు, గుర్తింపు సంఘాల ప్రతినిధులు, సిబ్బంది, ఉద్యోగులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం



**మందమర్రి, సెప్టెంబర్ 12 అక్షర కలం:**

క్రమశిక్షణతో కూడిన క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని క్రీడల గౌరవ కార్యదర్శి, ఏరియా సీనియర్ పిఓ ఎం కార్తీక్ తెలిపారు. శనివారం పట్టణంలోని సింగరేణి మైదానంలో 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో భాగంగా నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ, నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడాకారులు ఏరియా స్థాయిలోనే కాకుండా కంపెనీ స్థాయి కోలిండియా స్థాయి పోటీల్లో సైతం పాల్గొని, సింగరేణి ఖ్యాతిని నలుదిశలా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకుడు, సిఈఆర్ క్లబ్ సెక్రెటరీ పెద్దపల్లి బానయ్య, క్రీడల సమన్వయకర్త శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్





**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12:**

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని జిల్లాలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ లు తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ కు చెందిన ఎం శివ నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 2,50,000 రూపాయల విలువగల ఎల్ఓసి ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంజూరు చేయించి, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా మియాపూర్ కు చెందిన యు సూర్య సైతం అనారోగ్యంతో నిమ్స్ లో చికిత్స పొందుతుండగా, మంచిర్యాల జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు చొరవతో సిఎంఆర్ఎఫ్ కింద 2 లక్షల రూపాయల విలువగల ఎల్ఓసి ని మంజూరు చేయించి, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మొత్తంగా రెండు కుటుంబాలకు నాలుగు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి లు అందించి, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సురేఖ దంపతులు మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే దంపతులకు బాధిత కుటుంబాలు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12:**



స్థానిక సంస్థలలో కో ఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ పాలకవర్గాల్లో ట్రాన్స్ జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి విహెచ్పిఎస్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అదే సందర్భంలో వికలాంగులకు స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని, రాష్ట్రంలోని వికలాంగుల సంఘాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 50 లక్షలకు పైగా జనాభా కలిగిన దివ్యాంగులు ఉన్నారని, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులైన దివ్యాంగులు ఉన్నా వారి హక్కుల కోసం మాట్లాడే అవకాశం, ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం కల్పించకపోవడం పాలక పక్షాల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో 4శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయ రిజర్వేషన్ కల్పించే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గొప్ప ప్రజాస్వామ్య దేశంలో ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత ఇవ్వలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చి, స్థానిక పరిపాలనలో భాగస్వాములను చేయాలని కోరారు.

## ఆటపాటలతో హోరెత్తిన శ్రీహర్ష కళాశాల ఫ్రెషర్స్ పార్టీ

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12:**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ గార్డెన్ లో శనివారం మంచిర్యాల శ్రీహర్ష జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ వెల్కమ్ పార్టీ అంగరంగ వైభవంగా జరిగింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ వెల్కం పార్టీ ద్వారా ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకలో విద్యార్థినీ విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ చేసిన డ్యాన్స్ లు, పాటలు, స్కిట్ లు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యువత ఉత్సాహంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది.







కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులతో సీనియర్లు తమ అనుభవాలను పంచుకుంటూ, ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడుతూ, తమ కళాశాలలో విద్యను అభ్యసించి, గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి తమ కళాశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందించారు. కళాశాలలో కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ క్వాలిటీస్, క్రమశిక్షణ వంటివి సైతం అలవర్చుకోవాలని సూచించారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, పరిపూర్ణంగా విద్యను అభ్యసించినప్పుడే భవిష్యత్తులో ప్రయోజకులవుతారని విద్యార్థులకు హితబోధ చేశారు. అనంతరం వేడుకలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక పోటీలు, గేమ్స్ లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు చైర్మన్ చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పోటు మనోహర్ రెడ్డి, తనుగుల శ్రావణ్, ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జె రవీందర్ అకాల మరణం బాధాకరం

**నేడు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జేఆర్ సంతాప సభ**

**మందమర్రి, సెప్టెంబర్ 12 అక్షర కలం:**

అజాతశత్రువు, అందరి శ్రేయోభిలాషి జంగిలి రవీందర్ (జేఆర్) అకాల మరణం బాధాకరమని బిఆర్ఎస్, టిబిజికెఎస్ నాయకులు తెలిపారు. శనివారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సెప్టెంబర్ 9న జే రవీందర్ అనారోగ్యంతో అకాల మరణం చెందారని, ఆయన మృతికి సంతాపంగా ఆదివారం పట్టణంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో జేఆర్ సంతాప సభను పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంతాప సభకు జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో పాటు పట్టణంలోని అన్ని రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు, కుల, ప్రజా, యువజన, స్వచ్ఛంద సంఘాల నాయకులు, వర్తక



వాణిజ్య సంఘాల నేతలు, పట్టణ కులమతాలకు అతీతంగా హాజరై, జె రవీందర్ కు ఘనంగా నివాళులు అర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగే జేఆర్ కు ప్రతి ఒక్కరితో మంచి అనుబంధ ఉందని, పార్టీలకు అతీతంగా అందరికీ ఆయన సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన తన కుటుంబంతో పాటు సమాజాన్ని ప్రేమించిన వ్యక్తి అని, ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. చిన్నతనం నుండి చివరి శ్వాస వరకు ప్రజా శ్రేయస్సుకు కృషి చేశారని తెలిపారు. ప్రజలకు, కార్మిక వర్గానికి ఆయన లేని లోటు తీర్చలేమని తెలిపారు. పట్టణంలో బి(టి)ఆర్ఎస్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్) వ్యవస్థాపక సభ్యునిగా, పార్టీ నిర్మాణానికి, బలోపేతానికి ఎనలేని కృషి చేయడంతో పాటు సింగరేణి కార్మికులకు సోషల్ సెక్యూరిటీ ఫండ్ రూపకల్పనలో ఆయన కీలకపాత్ర పోషించి, కార్మిక వర్గానికి సేవలందించాలన్నారు. అందరి మనస్సులు గెలిచిన గొప్ప వ్యక్తి జే రవీందర్ అని కొనియాడారు. ఆయన మరణం పట్టణ ప్రజలకు తీరని లోటు అని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించూ జెఆర్ సంతాప సభకు పట్టణ ప్రజలు, జిల్లాలోని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై, జేఆర్ కు ఘనంగా నివాళులు అర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు బండారి సూరిబాబు, మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్, ఎండి అబ్బాస్, బోరిగం వెంకటేష్, ఎం ఈశ్వర్, బత్తుల శ్రీనివాస్, కనకం రవీందర్, పల్లె నర్సింహులు, మేడిపల్లి మల్లేష్, దాసరి రాజనర్సు, రాంసాని శేఖర్, సీపెల్లి రాజలింగు, సట్ట పోషం, భూపెల్లి కనకయ్య, మొగ్గురం శ్రీనివాస్, సీపెల్లి సాగర్, ముల్కల్ల రమేష్, అంధె శ్రీకాంత్, కాంపెల్లి సుధాకర్, బెల్లం అరుణ్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**-విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది: సర్పంచ్ జాడి లక్ష్మి.**

జైపూర్ మండలం, దుబ్బపల్లి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా దుబ్బపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఒకే విధమైన పాఠశాల దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమానికి వెంకట్రావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ జాడి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులలో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు పాఠశాల వాతావరణంలో క్రమశిక్షణకు ఏకరూప దుస్తులు దోహదపడతాయని తెలిపారు. సర్పంచ్ జాడి లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి తగినంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.





విద్యార్థులకు అవసరమైన పలు సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు శ్యామల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఏకరూప దుస్తులను అందుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955